ESTD : 1999

విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

స్టేట్ విజన్

STATE VISION

మంగళవారం 14-07-2026 పేజీలు : 16

ఉదండాపూర్ డ్యామ్ వద్ద సగం నంబర్ ప్లేట్లతో

# ఇసుక దందా

- రిజిస్ట్రేషన్ ఉన్నా నంబర్లు లేవు
- వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్
- సగం నంబర్ల దందా
- రిజిస్ట్రేషన్ ఉన్నా నంబర్లు లేవు
- అతివేగంతో ప్రమాదాల ముప్పు
- అనర్హులతో డ్రైవింగ్
- వరద మట్టిని ఇసుకగా అమ్మకం
- నిద్రమత్తులో అధికారులు

16 పేజీలో...

# రాష్ట్ర విశాల ప్రయోజనాల సాధనే లక్ష్యంగా పని చేయాలి




- ప్రాజెక్టులు, రవాణా వసతులకు అవసరమైన అనుమతులు సాధించాలి
- ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు చేయండి
- పార్టీలకు అతీతంగా అవసరమైన సమాచారం అందజేస్తాం
- ఎంపీల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విశాల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేయాలని ఎంపీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. రాజకీయాలకు అతీతంగా ఈ విషయంలో కలిసి ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతుల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం కోరారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఎంపీలకు మహాత్మాజ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశ జనాభాలో 10 శాతం జనాభా ఆరు మహా నగరాల్లో ఉందని, అయితే ఈ నగరాలు 25 శాతం జీడీపీ కలిగి ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక శాఖ అనుమతి అవసరమని... ఎంపీలు ఈ విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి ఐఐఎం మంజూరుకు విజ్ఞప్తి చేయాలని సీఎం సూచించారు.

12 పేజీలో...

విద్యుత్-వైద్య రంగాలకు

# కొత్త ఊపు



-రైతులకు విద్యుత్.. గ్రామీణులకు మెరుగైన వైద్యం
-రైతు సంక్షేమం-ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం
-పట్లూరులో రూ.3.40 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన
- మర్పల్లిలో రూ.25 లక్షలతో పల్లె దవాఖాన ప్రారంభించిన తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

మర్పల్లి, జూలై 13 (విజన్ ఆంధ్ర): గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. సోమవారం మర్పల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన పట్లూరు గ్రామంలో రూ. 3. 40 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు.

9 పేజీలో...

కాయిదంపల్లి ఎస్సీ కాలనీలో మూడు నెలల నుంచి

# తాగునీరు కటకట

- ఇబ్బందులు ఎదుర్కొన్న ఎస్సీ కాలనీ వాసులు

ఆందోల్ జూలై13 (విజన్ ఆంధ్ర ప్రతినిధి)మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని కాయిదంపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో గత మూడు నెలల నుంచి తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు సోమవారం ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారు.

15 పేజీలో...

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

- అర్హులైన ప్రతిఒక్కరికి అక్రిడిటేషన్ కార్డులను వెంటనే జారీచేయాలి
- జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి
- టి డబ్ల్యు జె ఎఫ్ ఆధ్వర్యంలో నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన

16 పేజీలో...

ఓటరు జాబితా ప్రత్యేక సవరణకు

# వేగం పెంచండి



3 పేజీలో...

## ప్రజావాణికి 156 ఫిర్యాదులు



నిజామాబాద్, జూలై 13 : (విజన్ ఆంధ్ర )ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 156 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావుతో పాటు డీఆర్ఓ గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావు, బోధన్ ఏసీపీ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పిట్టల ఎల్లయ్య పల్లి గ్రామంలో వనమహోత్సవం..

**లివన మహోత్సవంలో మొక్కలు నాటిన సర్పంచ్ పిట్టల రవికుమార్...**



ఓదెల జూలై 13,(విజన్ ఆంధ్ర) పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పిట్టల ఎల్లయ్య పల్లి గ్రామంలో సోమవారం సర్పంచ్ పిట్టల రవికుమార్ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ పిట్టల రవికుమార్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవికుమార్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం వల్ల వాతావరణ వాయు కాలుష్యాన్ని తగ్గించడంలో, నీటిని సంరక్షించడంలో, నేల కోతను నివారించడంలో ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కలువల అమూల్య, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## రెంజల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

**... ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్**



నిజామాబాద్ జులై13:( విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల మోడల్ స్కూల్‌లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అవినీతి, అక్రమాలపై అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రిన్సిపాల్ ఫిరోజ్‌పై వచ్చిన ఆరోపణలను సమగ్రంగా విచారించి, ఆయనను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెంజల్ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ అండతో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలు జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించాయని పేర్కొన్నారు. ఏబీవీపీ చేసిన ఆరోపణల ప్రకారం, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన ఏజెన్సీతో కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపించారు. అలాగే విద్యార్థుల హాజరు రికార్డుల్లో మార్పులు చేస్తూ రెండు వేర్వేరు రిజిస్టర్లు నిర్వహించడం, ఉపాధ్యాయుల సంతకాలను ఫోర్జరీ చేయడం వంటి చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వం ఒకేషనల్ కోర్సుల కోసం విడుదల చేసిన నిధులను దారి మళ్లించి, ఇతర వ్యక్తి బ్యాంకు ఖాతా ద్వారా నగదు డ్రా చేసి భారీ అవినీతికి పాల్పడ్డారని, పాఠశాల ఆవరణలో నిబంధనలకు విరుద్ధంగా చెట్లను నరికివేసి పర్యావరణానికి నష్టం కలిగించారని కూడా ఏబీవీపీ ఆరోపించింది. ఈ అక్రమాలకు సంబంధించి ఉపాధ్యాయుల సంతకాల ఫోర్జరీ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన విషయాలను ప్రిన్సిపాల్ స్వయంగా అంగీకరించినప్పటికీ ఇప్పటివరకు జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోలేదని ఏబీవీపీ విమర్శించింది. ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు సమాచారం ఉందని, విచారణ అధికారుల ముందు తమకు అనుకూలంగా వాంగ్మూలాలు ఇవ్వాలని ఉపాధ్యాయులు, సిబ్బందిపై ఒత్తిడి తీసుకువస్తున్నారని కూడా ఏబీవీపీ ఆరోపించింది. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించాలని ఏబీవీపీ కోరింది. ప్రిన్సిపాల్ ఫిరోజ్‌ను విధుల నుంచి తొలగించి, ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేసింది. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థి ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో రక్షిత్, చెర్రీ దీపాన్, సాయి, క్షైత్, శ్రీసాయి, శివ, సాయికుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం

**సిద్దిపేట యువజన క్రీడల అధికారి వీరారెడ్డి**



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 13 : సిద్దిపేట జిల్లా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని సోమవారం రోజున హుస్నాబాద్ మినీ స్టేడియంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా డీవైఎస్‌వో వీరారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన అథ్లెటిక్స్ కోచ్ రాజేష్, ఫెన్సింగ్ కోచ్ ఫణీంద్ర, వాలీబాల్ కోచ్ రిషిందర్ విద్యార్థులకు జనరల్ వార్మప్, కండిషనింగ్ వ్యాయామాలపై ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం కూడా సాధ్యమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ క్రమశిక్షణతో క్రీడల్లో రాణించి దేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఎంఈఓ బండారి మనీలా చదువుతో పాటు క్రీడలను సమన్వయం చేసుకుంటే ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చన్నారు. క్రీడలు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయన్నారు. హుస్నాబాద్ బాలుర, బాలికల, మోడల్ స్కూల్, బెజ్జంకి మైనారిటీ సోషల్ వెల్ఫేర్ పాఠశాలల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొని వార్మప్, కండిషనింగ్ వ్యాయామాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేడం లింగమూర్తి, కౌన్సిలర్ సిహెచ్. అనూష,జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి జె. వెంకట నర్సయ్య, పిడి ఆర్.శ్రీనివాస్, కబడ్డీ కోచ్ కృష్ణ, పలువురు పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

**- అర్హులైన ప్రతిఒక్కరికి అక్రిడిటేషన్ కార్డులను వెంటనే జారీచేయాలి**

**- జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి**

**- టి డబ్ల్యూ జె ఎఫ్ ఆధ్వర్యంలో నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన**



నిజామాబాద్ జూలై13:( విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ జిల్లాతో పాటు మండల జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను కేటాయించాలని, జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను త్వరితగతిన జారీ చేయాలని, దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టి డబ్ల్యూ జె ఎఫ్) ప్రతినిధులు డిమాండ్ చేశారు. టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు నిరసన చేపట్టారు. జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం జర్నలిస్టులు కృషిచేస్తున్నారని తెలిపారు. ఎండనక, వాననక విధుల్లో ఉంటున్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ ప్రాణాలకు తెగించి పోరాడారు. ఉద్యమం సందర్భంగా, ఆ తరువాత కూడా వందలాది మంది చనిపోయారు. పరిస్థితులు మారుతున్నాయి. ప్రభుత్వాల విధానాలు మారిపోతున్నాయి. కానీ, జర్నలిస్టుల బతుకుల్లో మాత్రం ఎలాంటి అభివృద్ధి కనిపించడం లేదు. ఉన్న రెండు వర్కింగ్ జర్నలిస్టు చట్టాలను యూనియన్ గవర్నమెంట్ కోడ్ల కింద మార్చేసి హక్కులను కాలరాసింది. కార్మిక చట్టాలను తుంగలో తొక్కింది. అటు యూనియన్ ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అభివృద్ధి, సంక్షేమ పథకాలను జర్నలిస్టులకు అందడం లేదు. చివరకు వృత్తి నిర్వహణకు కావాల్సిన అక్రిడిటేషన్ కార్డులు సైతం సకాలంలో ఇవ్వడం లేదు. అనేక ఉద్యమాల ఫలితంగా గత రెండు నెలల నుంచి అక్రిడిటేషన్ కార్డులు జారీచేస్తున్నారు. అర్హులైన వారందరికి ఇవ్వాలనేది తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) ప్రధాన ఉద్దేశ్యం అని తెలిపారు. అదేవిధంగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను త్వరితగతిన జారీచేయాలి. అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకూ కార్డు ఇవ్వాలి. ఒకే యూనియన్ నుంచి ప్రాతినిధ్యం వహించే వారిని అక్రిడిటేషన్ కమిటీల నుంచి తొలగించాలి. అందరికి సమాన ప్రాతినిధ్యం కల్పించాలి. జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చూడాలి. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకూ హెల్త్‌కార్డులివ్వాలి. కంట్రిబ్యూషన్ ను ప్రభుత్వమే జర్నలిస్టుల తరపున చెల్లించాలి. సీఎం రేవంత్రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఇండ్లస్థలాలు వెంటనే ఇవ్వాలి. యుద్ధప్రాతిపదికన ప్రక్రియకు శ్రీకారం చుట్టి జిల్లా, మండల కేంద్రాల్లో విలేకరులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి. రైల్వే పాసుల పునరుద్ధరణ కోసం మోడీ సర్కార్పై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి ప్రధాన డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ భుజంగరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, జిల్లా కార్యదర్శి రాంచందర్, జిల్లా నాయకులు మధు, అనిత, ప్రవీణ్, అఖిల్, రాజు, కృష్ణ, రాజేందర్, శ్రీకాంత్ గౌడ్, సురేష్, లక్ష్మణ్, ఆనంద్, లక్ష్మణ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## పుల్కల్ మండల ఉపసర్పంచ్‌ల ఫోరం నూతన అధ్యక్షుడిగా ఎర్ర శేఖర్ ఎన్నిక



చౌటకూర్ జూలై 13 (విజన్ ఆంధ్ర) :- పుల్కల్ మండల ఉపసర్పంచ్‌ల ఫోరం నూతన కమిటీ ఎన్నికలు సోమవారం నిర్వహించగా, మండలంలోని 19 మంది ఉపసర్పంచ్‌లు హాజరై ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో సింగూర్ గ్రామానికి చెందిన ఎర్ర శేఖర్ అధ్యక్షుడిగా, మిన్పూర్ గ్రామానికి చెందిన గోరిల్ల రమేష్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే పెద్దారెడ్డిపేటకు చెందిన శశికళ సహాయ కార్యదర్శిగా, పుల్కల్‌కు చెందిన కాశగారి ప్రవీణ్ కుమార్ సహాయ కార్యదర్శిగా, లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన నేనావత్ చాప్లా నాయక్ సలహాదారుగా ఎంపికయ్యారు.

తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ సమక్షంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎర్ర శేఖర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని 1,279 మంది ఉపసర్పంచ్‌లు ఒకే కుటుంబంగా, ఒకే యూనిట్‌గా పనిచేస్తూ తమ ఆత్మగౌరవం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్కల్ మండలంలోని వివిధ గ్రామాల ఉపసర్పంచ్‌లు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మమ్మేలు స్వామి మల్లన్న.......

**పెద్దపట్నం పై కొలువుతీరిన మల్లికార్జున స్వామి...**
**ముగిసిన పెద్దపట్నం మహోత్సవం**
**వైభవంగా ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి పెద్దపట్నం మహోత్సవం**
**రంగురంగుల తో ఒగ్గు పూజారులు వేసిన పెద్దపట్నం**
**స్వామివారిని దర్శించుకున్న భక్తులు**
**స్వామి సన్నిధిలో అగ్నిగుండం పై నడుస్తున్న భక్తులు**
**ముగిసిన పెద్ద పట్టణ మహోత్సవం**

ఓదెల జులై 13,(విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్రంలోని ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రాలలో ఓదెల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం ఒకటి. వదల భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఉగాదితో ప్రారంభమై పెద్దపట్నం మహోత్సవం తో ముగుస్తుంది. మల్లికార్జున స్వామిని దర్శించుకోవడానికి ప్రతి ఆదివారం,బుధవారం రోజులతో పాటు మిగతా రోజులలో స్వామివారిని దర్శించుకోవడానికి నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుంటారు. స్వయంభు గా వెలసిన మల్లికార్జున స్వామి చాలా మహిమగల దేవుడని భక్తుల అపార నమ్మకం. భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా భక్తులు కొలుస్తారు. ఆషాడమాసంలో జరిగే పెద్దపట్న మహోత్సవం ఆదివారం ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు నిత్యోత్సవం, 9 గంటల నుంచి 12:30 వరకు శ్రీ గణపతి పూజ,శివ పుణ్యాహవాచనము అనంతరం రాత్రి 10 గంటలకు ఒగ్గు పూజారులు రంగురంగుల తో పెద్ద పట్నం వేశారు. రంగు రంగులతో వేసిన పెద్ద పట్నంపై స్వామివారు కొలువుతీరారు. కొలువుదీరిన స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ రాష్ట్రాల జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని పెద్ద పట్టణ మహోత్సవాన్ని తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పెద్దపట్నం పై శివసత్తులు నాట్యం చేస్తూ శివనామస్మరణతో స్వామివారి దర్శించుకుని పసుపు,కుంకుమను దేవుడు ప్రసాదంగా తీసుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి జీవిత చరిత్రను ఒగ్గు పూజారులు ఒగ్గు కథ రూపంలో చెప్పారు. తెల్లవారుజామున 5 గంటలకు అగ్నిగుండ మహోత్సవంలో భక్తులు పుణ్య స్థానంలో ఆచరించి అగ్నిగుండంపై శివనామస్మరణ చేసుకుంటూ అగ్నిగుండంపై నడిచారు. అగ్నిగుండ మహోత్సవంతో పెద్దపట్నం మహోత్సవానికి ముగింపు పలికారు.

ఈ సందర్భంగా ఈవో సదయ్య మాట్లాడుతూ.... పెద్దపల్లి జిల్లాలో అతిపెద్ద సేవ క్షేత్రమైన ఓదెల మల్లికార్జున స్వామి మహిమగల దేవుడని స్వామి దయ వల్ల వర్షాలు సమృద్ధిగా పడి పాడిపంటలు పండాలని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండేలా భగవంతుని కోరుకున్నట్లు తెలిపారు. స్వామివారిని పెద్దపట్నం అగ్నిగుండ మహోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులకు స్వామివారి ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. పెద్దపట్నం మహోత్సవం ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సనత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

## శివంపేట సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు



చౌటకూర్ జూలై 13 (విజన్ ఆంధ్ర): మండల పరిధిలోని శివంపేట గ్రామ శివారులో అకోల్లో–నాందేడ్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-161)పై సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. జోగిపేట నుంచి సంగారెడ్డి వైపు వెళున్న ద్విచక్ర వాహనాన్ని, సంగారెడ్డి నుంచి వెండికోల్ గ్రామానికి రాంగ్ రూట్‌లో వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వాహనదారులు స్వల్ప గాయాలకు గురయ్యారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, నేషనల్ హైవే అంబులెన్స్ సాయంతో క్షతగాత్రులను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేదు

**అధికారులకు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ స్పష్టమైన ఆదేశాలు**
**-ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా వేగవంతమైన చర్యలు చేపట్టాలి**
**-ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారం చేయాలి**
**-తిరస్కరణకు గల కారణాలను అర్జీదారులకు స్పష్టంగా తెలియజేయాలి**
**-స్వీకరించిన అర్జీలపై చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి**
**-ప్రజావాణిలో 78 వినతులు స్వీకరణ**
**-డీఆర్వో మాలతి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి అర్జీల స్వీకరణ**



కుత్బుల్లాపూర్, జూలై 13 (విజన్ ఆంధ్ర): ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖలు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్–-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి మొత్తం 78 దరఖాస్తులను అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్వో మాలతి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకంతో సమయం, ధనం వెచ్చించి ప్రజావాణికి వస్తున్నారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టడం ప్రతి అధికారిపై ఉన్న బాధ్యత అని అన్నారు. అందిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, ఏదైనా దరఖాస్తును తిరస్కరించాల్సి వచ్చిన సందర్భంలో అందుకు గల కారణాలను స్పష్టంగా, పూర్తి వివరాలతో అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. అలాగే స్వీకరించిన ప్రతి దరఖాస్తుపై తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ వ్యవస్థలో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణకు వేగం పెంచండి

**బీఎల్ఓలకు జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశాలు**
**-ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణలో నిర్లక్ష్యానికి తావులేదన్న కలెక్టర్**
**-ఓటర్ల సందేహాలు నివృత్తి చేస్తూ పూర్తి అవగాహన కల్పించాలని సూచన**
**-స్వీకరించిన ఫారాలను వెంటనే డిజిటలీకరణ చేయాలని ఆదేశం**
**-అందుబాటులో లేని ఓటర్ల వివరాలను వెంటనే ఉన్నతాధికారులకు అందజేయాలని సూచన**
**-సుభాష్‌నగర్, కోంపల్లిలో ప్రత్యేక సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్**
**-రోజువారీ లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని బీఎల్ఓలకు స్పష్టమైన దిశానిర్దేశం**

కుత్బుల్లాపూర్, జూలై 13 (విజన్ ఆంధ్ర ): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని మేడ్చల్–-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి బూత్ స్థాయి అధికారులకు ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, పూరించిన ఫారాలను సకాలంలో స్వీకరించి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సుభాష్‌నగర్ వార్డు కార్యాలయంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులతో సమావేశమై పనితీరును సమీక్షించారు. ప్రతి ఫారాన్ని జాగ్రత్తగా పరిశీలించి, ఓటర్లకు ఎదురయ్యే సందేహాలను వెంటనే నివృత్తి చేస్తూ సరైన అవగాహన కల్పించాలని సూచించారు. స్వీకరించిన ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలీకరణ చేయాలని, అందుబాటులో లేని ఓటర్ల వివరాలను సంబంధిత పర్యవేక్షణ అధికారులకు తక్షణమే అందించాలని ఆదేశించారు. రోజువారీ లక్ష్యాలను వంద శాతం పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని బూత్ స్థాయి అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం కోంపల్లిలో కొనసాగుతున్న ఎన్యుమరేషన్, డిజిటలీకరణ ప్రక్రియలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అక్కడికి వచ్చిన ఓటర్లతో నేరుగా మాట్లాడి వారి సందేహాలను తెలుసుకొని, ఫారాలను సరైన విధంగా పూరించే అంశంపై అవగాహన కల్పించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి దశను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ''సమగ్ర శిక్ష నిధులపై కేంద్రం ఉక్కుపాదం''

**- ఎస్ఎన్ఏ స్పార్శ్ ద్వారానే నిధుల విడుదల**
**- ఫేషియల్ అటెండెన్స్ ఉంటేనే డైట్ బిల్లులకు ఆమోదం, వెండర్ల ఖాతాల్లోకే నేరుగా చెల్లింపులు**
**- నిధుల మళ్లింపునకు పూర్తిస్థాయిలో చెక్**

అక్కన్నపేట, జూలై 13 (విజన్ ఆంధ్ర): సమగ్ర శిక్ష నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. నిధుల దుర్వినియోగం, మళ్లింపునకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన మార్గదర్శకాలు జారీ చేయగా, వాటి అమలుకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇకపై సమగ్ర శిక్ష నిధులన్నీ కేంద్ర ప్రభుత్వ ఎస్ఎన్ఏ స్పార్శ్ (రాజీవా ఆవ్రాూవాెం) వేదిక ద్వారానే 'జస్ట్ ఇన్ టైమ్' విధానంలో విడుదల కానున్నాయి. దీంతో ప్రతి రూపాయి ఖర్చుపై కేంద్రం నేరుగా పర్యవేక్షణ నిర్వహించనుంది.

హాస్టళ్లు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో డైట్, కాస్మెటిక్ చార్జీల చెల్లింపులకు ఇకపై ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) ద్వారా నమోదైన హాజరే ప్రామాణికంగా పరిగణించనున్నారు. మాన్యువల్ హాజరు ఆధారంగా బిల్లులు ఆమోదించబోమని స్పష్టం చేశారు. దీంతో బోగస్ హాజరు, అక్రమ బిల్లులకు అడ్డుకట్ట పడనుంది.

వస్తువులు, సేవల కొనుగోళ్లకు సంబంధించిన చెల్లింపులు నేరుగా వెండర్లు, సరఫరాదారుల బ్యాంకు ఖాతాల్లోకే జమ చేయాలని ఆదేశించారు. అధికారుల వ్యక్తిగత ఖాతాల్లో సమగ్ర శిక్ష నిధులను నిల్వ చేయడం లేదా వినియోగించడం నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తామని హెచ్చరించారు. 2026--27 విద్యా సంవత్సరం నుంచి సమగ్ర శిక్ష నిధులన్నీ ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్ ద్వారా పీఎఓ లేదా ట్రెజరీ నుంచే డ్రా చేయాల్సి ఉంటుంది. రూ.25 వేలకుపైగా ఉన్న బిల్లులకు జీఎస్టీ నంబర్ తప్పనిసరి చేశారు. ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు తమ పరిధిలోని గ్రాంట్ల వినియోగంపై ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు లెక్కలు నమోదు చేయాల్సి ఉంటుంది. కేంద్రం విడుదల చేసిన నిధులను ఇతర అవసరాలకు మళ్లించడంపై కూడా పూర్తిస్థాయిలో నిషేధం విధించారు. ఈ కొత్త విధానాలతో సమగ్ర శిక్ష నిధుల వినియోగంలో పారదర్శకత పెరగడంతో పాటు అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని విద్యాశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# డిజిటల్ గవర్నెన్స్‌పై ప్రభుత్వాధికారులకు ప్రత్యేక శిక్షణ

**- రిటైర్డ్ ఒకేషనల్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ఎడబోయిన**



అక్కన్నపేట జూలై 13 విజన్ ఆంధ్ర : రాష్ట్ర ప్రణాళిక శాఖ.. టీజీ మ్యాథ్ (తెలంగాణ మెషిన్ లెర్నింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ)తో కలిసి ప్రభుత్వ ఉద్యోగులకు ఏఐ అప్‌స్కిల్లింగ్ కార్యక్రమం చేపట్టింది. భవిష్యత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ ఉద్యోగులను సిద్ధం చేయడమే ఈ కార్యక్రమ ప్రధానోద్దేశం. ఈ మేరకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులకు ఏఐ అప్‌స్కిల్లింగ్, సామర్థ్యం పెంపు కార్యక్రమాలను నిర్వహించనుంది. పలు శిక్షణ కార్యక్రమాల ద్వారా అధికారులకు ప్రాక్టికల్ ఏఐ, జనరేటివ్ ఏఐ అంశాలపై ప్రత్యక్ష శిక్షణ అందించనుంది. భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక సంస్థే ఈ టీజీ మ్యాథ్. ఇది భారతదేశంలోని 'ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా గుర్తింపు పొందింది.

# పిల్లల సంపూర్ణ ఆరోగ్యమే దేశ అభివృద్ధికి పునాది

**- మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత**
**- మధిరలో ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం**



మధిర, జూలై13 (విజన్ ఆంధ్ర) : పిల్లల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా మధిర పట్టణంలోని టీవీఎం స్కూల్,ఇల్లందులపాడులో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత,వైద్య సిబ్బందితో కలిసి విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులను (ఆల్బెండజోల్) స్వయంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సామినేని సుజాత మాట్లాడుతూ,పిల్లల ఎదుగుదలకు,వారి శారీరక,మానసిక వికాసానికి నులిపురుగుల నివారణ ఎంతో అవసరమని అన్నారు.పాఠశాల స్థాయిలో పిల్లలు తరచుగా ఎదుర్కొనే రక్తహీనత వంటి సమస్యలను అరికట్టేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు.మందు వేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను,పరిశుభ్రత ఆవశ్యకతను విద్యార్థులకు ఆమె వివరించారు.కలుషితమైన ఆహారం,నీరు మరియు అపరిశుభ్రమైన అలవాట్ల వల్ల పిల్లల కడుపులో నులిపురుగులు చేరి,వారిలో ఎదుగుదల లోపాలు,అలసట మరియు రక్తహీనతకు దారితీస్తాయని,తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండి పిల్లల ఆరోగ్య అంశాలపై దృష్టి పెట్టాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో దెందుకూరు పిహెచ్సి వైద్యులు డాక్టర్ పృథ్వీ నాయక్,ఆరోగ్య శాఖ సిబ్బంది,ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సామినేని రామనాథం, సూర్యదేవర కోటేశ్వరరావు,కౌన్సిలర్ నకిరికంటి రాజేశ్వరి,చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# చౌటకూర్‌లో ప్రత్యేక ఓటరు సవరణ

## ప్రక్రియను పరిశీలించిన ఆర్డీవో రమేష్‌బాబు

చౌటకూర్ జూలై 13 (విజన్ ఆంధ్ర):- మండలంలోని పోసానిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అందోలు-జోగిపేట ఆర్డీవో రమేష్‌బాబు ఆదివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఓటరు నమోదు ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ, బీఎల్వోల పనితీరును ఆయన పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను పూర్తిగా నింపి బూత్ స్థాయి అధికారులకు (బీఎల్వోలు) అందజేయాలని సూచించారు.ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో అధికారులను ఆదేశించారు.

# విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

జన్నారం, జులై 13 (విజన్ ఆంధ్ర) : నులిపురుగుల నివారణ కోసం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల కు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.జాతీ య నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారంరోజున జన్నారం మండ లంలోని పోనకల్ గ్రామపరిధికి చెందిన వివిధ పాఠ శాలల్లో అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాలలో సర్పం చ్ జక్కు సుష్మ భూమేష్ చేతుల మీదుగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం చేపట్టిన నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, వార్డు సభ్యుడు మర్రిపెల్లి అంజన్న, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# హుస్నాబాద్‌లో అమరుల స్థూప స్థలాన్ని కాపాడాలి




**జేఏసీ ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రాలు అందచేత**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 13 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అమరుల స్థూప స్థలాన్ని కాపాడాలని కోరుతూ అమరుల స్థూప స్థల సాధన కమిటీ ఆధ్వర్యంలో హుస్నాబాద్ ఆర్డిఓ, మున్సిపల్ కమిషనర్ కు వేర్వేరుగా సోమవారం రోజున వినతిపత్రాలు అందించారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ రీఫామ్స్ సీలింగ్ యాక్ట్ 1973 ప్రకారం సర్వే నెంబర్ 1189,275 లలో అదనపు భూమి కేటాయింపులు వాటిపై సమగ్ర విచారణ చేయాలని కోరారు.పై సర్వే నెంబర్ లలో భూమి మొత్తం ఎంత, ఎంత భూమి సీలింగ్, పేదలకు ఎంత ఇచ్చారు, వాటి హద్దులు, సీలింగ్ భూమి మరల భూయాజమానికి ఎట్లా మారింది. వీటిపై విచారణ చేయాలని, స్థూప స్థలాన్ని కబ్జా దారులనుండి కాపాడి అమరుల స్మృతి వనం నిర్మాణం కొరకు కృషి చేయాలని కోరారు.సర్వే నెంబర్ 1189/బి లో ముత్తినేని రాజేశ్వర్ రెడ్డి స్థూపం ముందు అక్రమ నిర్మాణం చేపట్టడం జరిగిందని,వివాద స్థలం భూమిలో అక్రమ గృహ నిర్మాణం చేసిందని అభ్యంతరం తెలపడం వలన మున్సిపాలిటీ మొదటి నోటీసు ఇచ్చిన విషయంను కమీషనర్ దృష్టికి తీసుకువెళితే, రెండవ నోటీసు ఇచ్చి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో కమిటీ ఛైర్మెన్ కవ్వ లక్ష్మారెడ్డి, కో ఛైర్మెన్ లు గడిపే మల్లేష్, ఎండీ.అన్వర్, గాదెపాక రవీందర్, ముక్కెర సంపత్ కుమార్, గన్నేబోయిన రాజేశం,ప్రధాన కార్యదర్శి వేకల వీరన్న యాదవ్,కార్యదర్శులు గూడ పద్మ,బండి పుష్ప,గజవెల్లి మురళి, పెట్టెం కుమారస్వామి, నాంపల్లి సమ్మయ్య, పెద్ది నిర్మల, పూదరి రవీందర్, ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, జనగామ రాజకుమార్, గంబీరపు మధు, వేల్పుల రాజు,పశ్మిమట్ల శ్రీనివాస్ గౌడ్, అబ్బరబోయిన రవి, అలుమల్ల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం
### కార్యక్రమం ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్



కల్లూరు, జులై 13(విజన్ ఆంధ్ర ): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కల్లూరులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్,ఏఎంసీ చైర్మన్ నీరజ దేవి కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ

1 నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలు అందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు ఉచితంగా ఇస్తారు అని వాటి వలన కడుపులోని నులిపురుగుల నుండి విముక్తి పొందవచ్చు అని తద్వారా పిల్లలు సరైన పోషకాలు పొంది శారీరకంగా దృఢంగా అవుతారు అని చదువుల్లో రాణిస్తారు అని పేర్కొన్నారు. పిల్లలు అందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు వైద్యాధికారి డాక్టర్ నవ్యకాంత్,మండల విద్యాశాఖ అధికారి పద్మ , కాంగ్రెస్ నాయకులు యాస శ్రీకాంత్ , ఆరోగ్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## నస్తీపూర్‌లో గ్రామంలో గల కాలభైరవ స్వామికి అభిషేకం

విజన్ఆంధ్ర హత్నూర : హత్నూర మండలంలోని నస్తీపూర్ గ్రామంలో సోమవారం నాడు కాలభైరవ స్వామికి అభిషేకం చేశారువందేళ్లకు ఒకసారి వచ్చే అత్యంత అరుదైన మహా శైవాక్షయోగం పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఈ అభిషేకంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నస్తిపూర్ గ్రామ సర్పంచ్ ప్రమీల సాయిలు ఉప సర్పంచ్ మహేందర్ పటేల్ మాట్లాడుతూ ఈ అభిషేకం ఫలితంగా పుష్కలంగా వర్షాలు కురిస్తే రైతాంగం మరియు ప్రజలు సుఖ సంతోషంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేందర్ పటేల్ వార్డు సభ్యులు శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు,ప్రభాకర్ రెడ్డి, గ్రామ ప్రజలు యువతి యువకులు పాల్గొన్నారు.

# మందు బాబులకు అడ్డాగా...పల్లె ప్రకృతి వనం..

**- గుజిరీతండా పల్లె ప్రకృతి వనంలో బీరు సీసాల కలకలం**





చిలిపిచేడ్ జులై 13 విజన్ ఆంధ్ర: తెలంగాణలోని గ్రామాల్లో ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు, కొందరు తాగుబోతుల నిర్లక్ష్యం వల్ల చెత్తాచెదారం, ఖాళీ బీరు సీసాలతో నిండిపోతున్నాయి. ఈ పార్కులలో పచ్చని మొక్కలకు బదులు ప్లాస్టిక్ కవర్లు, పగిలిన బీరు సీసాలు దర్శనమివ్వడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

మారుమూల గ్రామీణ ప్రజలు సేద తీరేందుకు ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతి వనాలు మందుబాబులకు అడ్డాలుగా మారాయి.చిలిపిచేడ్ మండలంలోని గుజిరీతండాలో బీఆర్ఎస్ ప్రభుత్వ ఆయంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం మందు బాబులకు అడ్డాగా మారింది.అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఆయా గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు నిర్వహణ సరిగా లేక పిచ్చి మొక్కలతో నిండిపోయాయి.కొన్ని ప్రాంతాల్లో చెట్లు ఎండిపోయాయి.విష పురుగులు ఉంటాయని అందులోకి వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు.ప్రకృతి వనంలో చెత్తాచెదారం,ప్లాస్టిక్ బాటిళ్లు, బీరు సీసాలు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి ప్రకృతి వనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

**- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ**

**-- ఆరోగ్యమే భవిష్యత్తుకు పునాది అని సూచన**



టేకులపల్లి జూలై 13 (విజన్ ఆంధ్ర): ఇల్లందు నియోజకవర్గ స్థానిక ఎమ్మెల్యే శ్రీ కోరం కనకయ్య సోమవారం కోయగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం ద్వారా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చిన్నారుల్లో నులిపురుగుల సమస్య వల్ల రక్తహీనత, విరేచనాలు, పోషకాహార లోపం, శారీరక ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. వాటి ప్రభావంతో విద్యార్థులు చదువుల్లోనూ, క్రీడల్లోనూ వెనుకబడే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.నేటి విద్యార్థులే రేపటి భారతదేశ భవిష్యత్తని పేర్కొన్న ఆయన, పిల్లల ఆరోగ్యాభివృద్ధి, విద్యాభివృద్ధి కోసం వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భోజనం చేసే ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేయరాదని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రభుత్వం ఉచితంగా అందించే ఆల్బెండజోల్ మాత్రలను ప్రతి బాలబాలిక తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కోయగూడెం సర్పంచ్ కోరం సుభాష్ చంద్రబోస్, కోరం సురేందర్, లక్కినేని శ్యామ్, రవి, వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్, కోయగూడెం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. నాగేశ్వరరావు, బి. నాగేశ్వరరావు, అమర్ సింగ్, తారాబాయి, రమాదేవి, జానకి, మంగమ్మ, సునీత, ఈ.పీ. రాజు, హాము, సైదులు, రాంబాబు, కిషోర్ సింగ్, రవికుమార్, లక్ష్మీనారాయణ, బద్రు, రమేష్, మోతీలాల్, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, సూపర్వైజర్లు గుజ్జా విజయ, కౌసల్య సింగ్, ఏఎన్ఎంలు బిజ్జా అనసూయ, వెంకటరమణ, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# యూనిఫామ్ జాడేది?

**-పాఠశాలలు ప్రారంభమై నెల రోజులైనా..**

**-ఒకేషనల్ టీచర్స్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు కళాధర్ రెడ్డి**



అక్కన్నపేట జూలై 13 విజన్ ఆంధ్ర : విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే వీరాదిమంది విద్యార్థులకు ఇప్పటివరకు యూనిఫామ్ పంపిణీ చేయలేదు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 787 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, అందులో సుమారు 39 వేల మందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గతంలో ప్రభుత్వం విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఒక్కో జత దుస్తులు (యూనిఫామ్) అందించి తర్వాత మరో జత అందించేది.అయితే ఈ సంవత్సరం విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నప్పటికీ యూనిఫామ్ పంపిణీ అంశాన్ని ఎవరు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్ర భుత్వ పాఠశాలలో దాదాపు చదువుకునే పిల్లలంతా పేద వర్గాలకు చెందిన వారే కావడం వల్ల వారికి సరైన దుస్తులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు రెండు జతల దుస్తులతో పాటు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఉదయం అల్పాహారం, వర్క్ బుక్కులు, ఇతర సదుపాయాలు కల్పిస్తామని, ఒక పైసా ఖర్చు లేకుండా పేద పిల్లలకు నాణ్యమైన విద్యా బోధన అందించడంతోపాటు విద్యార్థులకు అవసరమైన వసతులు, సౌకర్యాలను కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా విద్యార్థులకు రెండు జతల దుస్తులు అందించాల్సి ఉండగా, కనీసం ఒక జత దుస్తులు కూడా ఇవ్వకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇప్పటివరకు విద్యార్థులకు అందించే దుస్తులకు సంబంధించిన విషయంపై విద్యాశాఖ అధికారులు ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు దుస్తులు తామే ఏర్పాటు చేయాలా, ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందా అనే సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వం గతంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఒకే తరహాలో ఉండే విధంగా యూనిఫాం అందించేది. ఈసారి యూనిఫామ్ రంగు మార్చాలని యోచన చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.దీనివల్ల యూనిఫాం అందించడానికి జాప్యం జరుగుతున్నట్లు చెబుతున్నారు. అయితే కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న బాలికలకు యూనిఫాం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారని, విద్యార్థులకు మాత్రం యూనిఫామ్ విషయంలో ఇప్పటివరకు ఎటువంటి సమాచారం లేదని, కేసముద్రం ఎంఈవో యాదగిరి తెలిపారు. ప్రభుత్వం నుండి యూనిఫాం వచ్చిన వెంటనే విద్యార్థులకు అందజేస్తామని, ఇప్పటివరకు యూనిఫామ్‌కు సంబంధించిన సమాచారం ఏదీ లేదని ఆయన స్పష్టం చేశారు.

# ఎంపీపీఎస్ కొలామా-జీ పాఠశాలలో వర్క్‌బుక్స్ పంపిణీ



## - విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేత

నారాన్నూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం,విద్యార్థుల్లో అభ్యాస నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా మండలంలోని ఎంపీపీఎస్ కొలామా-జీ పాఠశాలలో సోమవారం వర్క్‌బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఇదే సందర్భంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.గ్రామ సర్పంచ్,పాఠశాల ఉపాధ్యాయులు కలిసి విద్యార్థులకు వర్క్‌బుక్స్ అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ రాథోడ్ స్వాతి జగన్నాథ్ మాట్లాడుతూ,ప్రభుత్వం అందిస్తున్న వర్క్‌బుక్స్‌ను సద్వినియోగం చేసుకుని ప్రతిరోజూ సాధన చేయాలని, పాఠాలను క్రమం తప్పకుండా అభ్యసించి విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు."విద్యార్థుల భవిష్యత్తుకు పునాది నాణ్యమైన విద్యే ప్రభుత్వం అందిస్తున్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చు" అని అన్నారు.అలాగే నులిపురుగుల నివారణ కోసం పంపిణీ చేసిన ఆల్బెండజోల్ మాత్రలు పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలను నివారించడంలో దోహదపడతాయని తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సభా,విద్యార్థులు,గ్రామ పెద్దలు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# చౌటకూర్‌లో అధికారుల అలస్యంపై తహశీల్దార్ ఆగ్రహం



చౌటకూర్ జూలై 13 (విజన్ ఆంధ్ర):- మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆలస్యంగా హాజరైన వివిధ శాఖల అధికారులపై తహశీల్దార్ నామాల కిష్టయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు సమయపాలన పాటించడం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఇకపై ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఆలస్యం లేకుండా హాజరుకావాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులను తహశీల్దార్ హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలని పరమశివుడికి జలాభిషేకం

## - కాశీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో చిన్నారుల నుంచి పెద్దలు

సంగారెడ్డి జిల్లా చౌటకూర్ జూలై 13 (విజన్ ఆంధ్ర ):- మండల కేంద్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ సోమవారం గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పరమశివుడికి ప్రత్యేక జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని శ్రీ కాశీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో చిన్నారుల నుంచి పెద్దల వరకు వయోభేదం లేకుండా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.భక్తులు "ఓం నమఃశివాయ" నామస్మరణతో శివలింగానికి పవిత్ర జలాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది వర్షాకాలం ప్రారంభంలో నిర్వహించే ఈ సంప్రదాయం గ్రామంలో దశాబ్దాలుగా కొనసాగుతుండగా, గ్రామస్థులు ఎంతో భక్తి, విశ్వాసాలతో ఈ ఆచారాన్ని పాటిస్తున్నారు.జలాభిషేకం అనంతరం గ్రామస్థులు ఊరేగింపుగా ఆనందం చెరువు వద్దకు చేరుకుని పాయసాన్ని నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వర్షదేవతలు ప్రసన్నమై పుష్కలంగా వర్షాలు కురిపించాలని, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని, చెరువులు, కుంటలు నిండాలని, గ్రామంలో సుభిక్షం నెలకొనాలని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ యువకుడు మంగలి చెన్నయ్య మాట్లాడుతూ, ఈ సంప్రదాయం తమ పూర్వీకుల కాలం నుంచి కొనసాగుతోందని తెలిపారు. గతంలో కూడా ఈ ఆచారం అనంతరం మంచి వర్షాలు కురిసేవని గ్రామస్థుల విశ్వాసమన్నారు. అందుకే ప్రతి సంవత్సరం యువకులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు అందరూ కలిసి భక్తి భావంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు.

జలాభిషేకం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధికారులు, యువకులు, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# రాష్ట్ర అథ్లెటిక్స్‌లో మెరిసిన బెల్లంపల్లి క్రీడాకారులు



బెల్లంపల్లి, జూలై 13 విజన్ ఆంధ్ర: తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో బెల్లంపల్లి క్రీడాకారులు ప్రతిభ చాటారు. హైదరాబాద్‌లోని స్పోర్టోపియా స్పోర్ట్స్ అకాడమీ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో అడిచర్ల అక్షయ స్టాండింగ్ లాంగ్ జంప్‌లో 1.61 మీటర్లు దూకి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అరుసం చిన్మయి చైత్రిక 60 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానం సాధించి కాంస్య పతకం అందుకుంది. ఎర్ర త్రినయ్ 300 మీటర్ల పరుగుపందెంలో ఐదో స్థానంలో నిలిచి ప్రతిభ కనబర్చాడు. ఈ క్రీడాకారులకు సల్పాల సంతోష్ యాదవ్ కోచ్‌గా శిక్షణ అందించారు. రాష్ట్రస్థాయిలో బెల్లంపల్లి పేరు నిలబెట్టిన క్రీడాకారులను మంచిర్యాల అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఈ. మారయ్య అభినందించి, భవిష్యత్‌లో జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

# నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

కుల్కచర్ల, జూలై, 13 (విజన్ ఆంధ్ర): నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను తప్పక వేయించాలని కుల్కచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ గౌడ్ తెలిపారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేయించారు. వైద్యాధికారి మాట్లాడుతూ...పరిసరాలు, వ్యక్తి గత శుభ్రత లోపించడం వలన నులిపురుగులు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉందన్నారు. వీటి ఫలితంగా పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, శారీరక, మానసిక ఎదుగుదల మందకొడిగా ఉంటుందని చెప్పారు. అందుకే 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలందరికీ నులిపురుగు నివారణ మాత్రలను తప్పక వేయించాలని సూచించారు. ఈ రోజు మాత్రలు వేసుకోని వారికి తిరిగి ఈ నెల 20 తేదిన మాత్రలను అందించనున్నట్లు తెలిపారు. నులిపురుగులు నివారించడం అందరి బాధ్యత అని వైద్యాధికారి తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకట్, ఏఎన్ఎం జంగమ్మ, పాఠశాల సిబ్బంది రాజేందర్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవకు 'ఎక్సలెంట్ అవార్డు--2026'..

## కోలా రవీందర్ ముదిరాజ్‌కు ఘన సత్కారం

## -సుజనాన ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో వైభవంగా సకల కళా సమ్మేళనం

## -మాజీ కేంద్ర మంత్రి డా. వేణుగోపాల చారి చేతుల మీదుగా అవార్డు ప్రదానం

## -'అవార్డు మరింత బాధ్యతను పెంచింది.. ప్రజాసేవలో మరింత చురుకుగా ఉంటా' - కోలా రవీందర్ ముదిరాజ్

కుత్బుల్లాపూర్, జులై 13 (విజన్ ఆంధ్ర) : సుజనాన ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సకల కళా సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎక్సలెంట్ అవార్డు--2026ను సామాజిక, పర్యావరణ సేవల్లో విశేష కృషి చేస్తున్న కోలా రవీందర్ ముదిరాజ్కు ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ వేణుగోపాల చారి ముఖ్య అతిథిగా హాజరై అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల చారి మాట్లాడుతూ, సమాజానికి సేవ చేస్తున్న వ్యక్తులను గౌరవించడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. కోలా రవీందర్ ముదిరాజ్ పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, ప్రతి ఇంటి స్థలంలో ఇంకుడు గుంతలు, ఇంజెక్షన్ బోర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారని కొనియాడారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించేందుకు ఆయన చేస్తున్న ప్రచారం అభినందనీయమని, చిన్నారులకు ఈతపై అవగాహన కల్పించేందుకు చేస్తున్న కృషి సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఆయన ఆశయాలు నెరవేరాలని భగవంతుడిని, ప్రభుత్వాన్ని కోరుకుంటున్నట్లు తెలిపారు. చిన్నారుల కళా ప్రతిభను వెలికితీసే వేదికల అవసరాన్ని ప్రస్తావించిన వేణుగోపాల చారి, ప్రస్తుతం పిల్లలు మొబైల్ ఫోన్లకు బానిసలవుతున్న



పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు. పిల్లలకు ఫోన్లు ఇవ్వడం కంటే నృత్యం, సంగీతం, సాంస్కృతిక కార్యక్రమాల వైపు ప్రోత్సహించాలని, వారి ప్రతిభను వెలుగులోకి తీసుకురావడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురికి అవార్డులు ప్రదానం చేశారు. ఆర్.ఆర్. పిల్లేకు కూడా ప్రత్యేక అవార్డును అందజేశారు. ఈ వేడుకలో రాజేంద్ర కుమార్ పూనా (ఆర్టిస్ట్), డాక్టర్ సముద్రాల శ్రీదేవి, డాక్టర్ భాగ్యలక్ష్మి రెడ్డి, వీరభోగ వసంతరాయులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన విద్యార్థులు అద్భుతమైన నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించగా, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులు, ప్రేక్షకులు కళా ప్రదర్శనలను ఆస్వాదిస్తూ చప్పట్లతో ఆడిటోరియంను మార్మోగించారు. అవార్డు అందుకున్న అనంతరం కోలా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. ప్రజల ఆశీస్సులతో పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొంటానని, సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. భగవంతుడు తనకు ఆయురారోగ్యాలు ప్రసాదించి ప్రజాసేవ చేసే అవకాశం కల్పించాలని ఆకాంక్షించారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

పెద్ద శంకరంపేట, జూలై 13: విజన్ ఆంధ్ర: పెద్ద శంకరంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం వైద్యాధికారి డా. షర్ఫుద్దీన్ మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో నులిపురుగుల నివారణ మాత్రలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన చిన్నారికి తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు అందించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వేణు శేఖర్, ప్రిన్సిపాల్ శోభారాణి, హెచ్ఈఓ యాదయ్య, ఎంపీహెచ్ఎస్ యాదమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ డా. సునీల్, ఆరోగ్య శాఖ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అధ్వానంగా మారిన చౌటకూర్-కొన్యాల రహదారి.. మరమ్మతులకు స్థానికుల డిమాండ్



చౌటకూర్ జూలై 13 (విజన్ ఆంధ్ర):-మండల కేంద్రం నుంచి కొన్యాల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అడుగడుగునా గుంతలతో అధ్వానంగా మారింది. దీంతో ఈ మార్గంలో నిత్యం ప్రయాణించే వాహనదారులు, రైతులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రస్తుతం రహదారిపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై మట్టి వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో పాటు శాశ్వతంగా రహదారిని పునర్నిర్మించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# వందేళ్లకోసారి విశేష సోమవారం

**- బుగ్గ శివాలయానికి పోటెత్తిన భక్తులు**

**- భారీ క్యూలైన్లు.. ఏర్పాట్లపై అసంతృప్తి**



బెల్లంపల్లి జూలై 13 విజన్ ఆంధ్ర బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామంలోని బుగ్గ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. వందేళ్లకోసారి వచ్చే విశేష సోమవారం సందర్భంగా శివారాధనకు విశేష ఫలితాలు ఉంటాయనే నమ్మకంతో తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. దీంతో దర్శనం కోసం ఆలయం వెలుపల వరకు క్యూలైన్లు ఏర్పడి, భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. భక్తుల రద్దీకి తగిన ఏర్పాట్లు చేయలేదని దేవాదాయ శాఖ అధికారులపై పలువురు భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీరు, నీడలేకపోవడం , క్యూలైన్ల నిర్వహణలో లోపాలున్నాయని భక్తులు పేర్కొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. శివారాధనతో సకల పాపాలు తొలగి సుఖశాంతులు, ఐశ్వర్యం చేకూరుతాయని, భక్తితో చేసే పూజకు పరమశివుని అనుగ్రహం లభిస్తుందని ఆలయ పండితులు తెలిపారు.

# ప్రతి చిన్నారికి ఆల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి: దేవరసమతవెంకట్‌రెడ్డి



చేవెళ్ల, జూలై 13 (విజన్ ఆంధ్ర): ఒక్క చిన్నారి కూడా ఆల్బెండాజోల్ మాత్రకు దూరం కాకుండా తల్లిదండ్రులు సహకరించాలి అని చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతవెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ… ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి ప్రభుత్వం ఏడాదిలో రెండుసార్లు ఉచితంగా ఈ మాత్రలను అందజేస్తోందన్నారు. నులి పురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. ఆల్బెండాజోల్ మాత్రలు వేయించడం ద్వారా నులి పురుగులను నివారించడంతో పాటు పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ నెల 20న నిర్వహించే తదుపరి పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, అదనపు సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎ. వేదశ్రీ, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కల్లూరు మున్సిపాలిటీలో ఘనంగా మిషన్ శుభ్రత కార్యక్రమం

**-శానిటరీ కార్మికులకు పనిముట్ల పంపిణీ**

కల్లూరు, జులై 13(విజన్ ఆంధ్ర ): మున్సిపాలిటీలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ శుభ్రత కార్యక్రమాన్ని మున్సిపాలిటీ కార్యాలయం నందు సోమవారం ఘనంగా ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణ రెడ్డి,కౌన్సిలర్లతో కలిసి శానిటరీ కార్మికులకు పారిశుద్ధ్య పనులకు అవసరమైన చీపుర్లు, పారలు, గడ్డపారలు,ఇతర పనిముట్లను పంపిణీ చేయడం జరిగింది.

అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది,శానిటరీ కార్మికులతో కలిసి 'క్యాచ్ ది రైన్' ప్రతిజ్ఞ నిర్వహించారు. వర్షపు నీటి సంరక్షణ,పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతిజ్ఞ చేశారు.

తదుపరి మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు నందు శానిటరీ కార్మికులందరూ ఒకే వార్డులో సమిష్టిగా పాల్గొని 'మాస్ గ్యాంగ్ వర్క్' ద్వారా రహదారులు, కాలువలు, కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.చెత్త తొలగింపు,కాలువల శుభ్రపరచడం,రోడ్ల స్వీపింగ్, మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగించడం వంటి పనులు నిర్వహించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ …

స్వచ్ఛతే లక్ష్యం,శుభ్రతే మార్గం

అనే నినాదంతో మున్సిపాలిటీ మిషన్ శుభ్రత కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పట్టణ పరిశుభ్రతలో శానిటరీ కార్మికుల సేవలు ఎంతో గొప్పవని, వారి అంకితభావంతోనే పరిశుభ్రమైన పట్టణ నిర్మాణం సాధ్యమవుతుందని కొనియాడారు.

శానిటరీ కార్మికులకు అవసరమైన పనిముట్లను అందించడం ద్వారా మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి వార్డులో ఇదే తరహాలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి 'క్లీన్ మున్సిపాలిటీ గ్రీన్ మున్సిపాలిటీ ' లక్ష్యాన్ని సాధిస్తామని చెప్పారు.

ప్రతి ఇంటి నుంచి స్వచ్ఛత ప్రారంభమవ్వాలని, ప్రజలు తడి-పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్ జి. సాయి కృష్ణారెడ్డి గారు మాట్లాడుతూ

మిషన్ శుభ్రత కార్యక్రమం మున్సిపాలిటీని పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమమని తెలిపారు. ప్రతి వార్డులో ముందుగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, షెడ్యూల్ ప్రకారం అన్ని వార్డుల్లో మిషన్ శుభ్రతను విజయవంతంగా అమలు చేస్తామని పేర్కొన్నారు.

మిషన్ శుభ్రత ఒక్కరోజు కార్యక్రమం కాదని, ఇది ప్రతి ఉద్యోగి, ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి పౌరుడు బాధ్యతగా భావించి నిరంతరం కొనసాగించాల్సిన ప్రజా ఉద్యమమని అన్నారు. శానిటరీ కార్మికులు తమ విధులను అంకితభావంతో నిర్వహిస్తూ పట్టణ పరిశుభ్రతకు మరింత కృషి చేయాలని సూచించారు.

ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే వేయాలని, తడి-పొడి చెత్తను వేరు చేయాలని, వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, పరిశుభ్రమైన కల్లూరు నిర్మాణంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.మిషన్ శుభ్రతలో భాగంగా ప్రతి శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు, కాలువల శుభ్రపరిచే పనులు, రోడ్ల స్వీపింగ్, చెత్త తొలగింపు, మొక్కల సంరక్షణ, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి , కౌన్సిలర్లు లక్కినేని రఘు , జిల్లెల్ల స్వాతి, బీరెల్లి మాధవరావు , దాసరి సుధారాణి , భుక్య రాంబాయ్, బానోత్ మారోని , కళ్యాణపు నవ్య , పెద్దబోయిన లక్ష్మీ నరసింహారావు , కిష్టంశెట్టి లక్ష్మి , మహమ్మద్ ఇస్మాయిల్ , దార్ల చిన్నలక్ష్మి, యాసా నాగమణి శ్రీకాంత్ , ఉబ్బన రాంబాబు , కనపర్తి శ్యామల, పెడకంటి కృష్ణయ్య, ఖమ్మంపాటి రాధ, గుండ్ల పుల్లారావు , మున్సిపల్ అధికారులు మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు కార్యాలయ సిబ్బంది, శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.



# వర్షపు నీటి సంరక్షణ అందరి బాధ్యత

**హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ టి. మల్లిఖార్జున్ గౌడ్**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 13 : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన క్యాచ్ ద రైన్ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పురపాలక సంఘ కమిషనర్ టి. మల్లికార్జున్ కంపోస్ట్ షెడ్ వద్ద పారిశుద్ధ్య సిబ్బందితో వర్షపు నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రైన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్ ప్రాముఖ్యతను వివరించి, వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు కూడా రైన్ వాటర్ హార్వెస్టింగ్ విధానంపై విస్తృతంగా అవగాహన కల్పించి, ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టేలా ప్రోత్సహించాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, జవాన్లు శ్రీకాంత్, నవీన్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ప్రజావాణిలో చనిపోతానంటూ మహిళ ఆందోళన



నస్పూర్, జులై 13 (విజన్ ఆంధ్ర): న్యాయం చేయకుంటే చనిపోతానంటూ సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో బుర్ర మల్లేశ్వరి అనే మహిళ ఆందోళనకు దిగింది. తాను కొనుగోలు చేసిన ప్లాట్ ను వేరొకరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, పోలీసుల చుట్టూ ఎంత తిరిగిన ఫలితం లేదని కలెక్టర్ కు మొరపెట్టుకుంది. తనకు న్యాయం జరగని పక్షంలో తన పిల్లలతో సహా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో... ఆమెపై కేసు నమోదు చేయాలని కలెక్టర్ పోలీసులను ఆదేశించారు. అనంతరం పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

# మంచిర్యాల జిల్లా కార్యదర్శిగా పసులేటి వెంకటేష్



బెల్లంపల్లి, జులై 13 విజన్ ఆంధ్ర : తెలంగాణ ఉద్యమ కారుల వేదిక మంచిర్యాల జిల్లా కార్యదర్శిగా, కన్నెపల్లి మండల ఇన్‌చార్జిగా బెల్లంపల్లి హనుమాన్ బస్తీకి చెందిన పసులేటి వెంకటేష్‌ను నియమించారు. బెల్లంపల్లిలోని టియువి కార్యాలయంలో రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు గోగర్ల రాజేశం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజేశం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉద్యమకారులను ఏకం చేసి సంస్థను మరింత బలోపేతం చేస్తారనే నమ్మకంతో వెంకటేష్‌కు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. వెంకటేష్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, తెలంగాణ ఉద్యమకారుల హక్కులు, సంక్షేమం కోసం కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి టౌన్ వైస్ ప్రెసిడెంట్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# జంగాలపల్లి వద్ద ప్రధాన రహదారిపై గ్రామస్తుల ధర్నా..

## మూడేళ్లుగా పూర్తి కాని రోడ్డు పనులపై ఆగ్రహం



కాటారం డివిజన్ ప్రతినిధి, జులై 13 (విజన్ ఆంధ్ర) : శంకరంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జంగాలపల్లి వద్ద కాటారం--మంథని ప్రధాన రహదారిపై సోమవారం గ్రామస్తులు నడిరోడ్డుపై వాహనాలను అడ్డంగా నిలిపి ధర్నా నిర్వహించారు. గత మూడు సంవత్సరాలుగా రహదారి నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న రహదారి కారణంగా రోజూ దుమ్ము, ధూళి ఇళ్లలోకి చేరుతుండడంతో చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాస సంబంధిత సమస్యలు, ఆస్తమా వంటి అనారోగ్యాలకు గురవుతున్నారని గ్రామస్తులు తెలిపారు. రోడ్డుపై రాళ్లు పేరుకుపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు కూడా ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు.

ధర్నా కారణంగా రహదారికి ఇరువైపులా బస్సులు, లారీలు, ఇతర వాహనాలు భారీగా నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఇప్పటికే ఎన్నోసార్లు ధర్నాలు చేసినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చి సమస్యను పరిష్కరించలేదని గ్రామస్తులు ఆరోపించారు. కాటారం నుంచి గంగారం ఎక్స్ రోడ్ వరకు సుమారు రూ.30 కోట్లతో చేపట్టిన రహదారి పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేసి వెళ్లిపోయాడని, నిధులు పూర్తయ్యాయని చెప్పి పనులు వదిలేశారని తెలిపారు.

ఈ పరిస్థితికి అధికారుల నిర్లక్ష్యమా, కాంట్రాక్టర్ వైఫల్యమా అన్నది విచారించి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే జోక్యం చేసుకుని రహదారి పనులను పూర్తి చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. తమ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి ప్రశాంతంగా జీవించేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలని శివలింగాలకు జలాధివాసం



పెబ్బేరు, జులై 13( విజన్ ఆంధ్ర ) మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని దేవాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. శ్రీ శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంతో పాటు హిందూ జాగృతం ఆధ్వర్యంలో శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలోని శివలింగానికి కూడా ప్రత్యేక పూజలు, మహారుద్రాభిషేకాలు, జలాధివాస కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఈ సందర్భంగా కృష్ణ పక్ష చతుర్దశి, ఆరుద్ర నక్షత్రం ఒకే రోజు రావడం విశేషమని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. తెల్లవారుజామునే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఉదయం 5 గంటల నుంచే అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య మహారుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం రాష్ట్రంలో, జిల్లాలో, గ్రామాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని సంకల్పిస్తూ జలాధివాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.

జలాధివాసం అనేది ఆగమ శాస్త్రాల్లో పేర్కొన్న విశిష్ట ఆధ్యాత్మిక క్రతువులలో ఒకటి. ఇందులో శివలింగాన్ని లేదా దేవతా విగ్రహాన్ని పవిత్ర జలంతో పూర్తిగా ఆవరించి కొంత సమయం పాటు నీటిలో ఉంచి ప్రత్యేక మంత్రోచ్చారణలతో పూజలు నిర్వహిస్తారు. ఇది ప్రకృతి సమతుల్యత, వర్షాల అనుగ్రహం, లోకక్షేమం, పంటల సుభిక్షం, ప్రజల శాంతి, సౌభాగ్యం కోసం చేసే విశేష ఆరాధనగా భావిస్తారు. తీవ్రమైన ఎండలు, వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు శివుని ప్రసన్నం చేసుకునేందుకు అనేక ప్రాంతాల్లో ఈ జలాధివాసాన్ని నిర్వహించే సంప్రదాయం ఉంది. పెబ్బేరులోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో హిందూ జాగృతం ఆధ్వర్యంలో శివలింగాన్ని పూర్తిగా పవిత్ర జలంలో ముంచి జలాధివాసం నిర్వహించారు. శివభక్తులు "ఓం నమఃశివాయ", "హర హర మహాదేవ" నామస్మరణలతో భక్తిపారవశ్యంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరూ మంచి వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.

ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. చిన్నారులు, మహిళలు, యువకులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో రెండు ఆలయాల ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, హిందూ జాగృతం ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేసి సేవలు అందించారు.

ఈ కార్యక్రమాల్లో శివభక్తులు, ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, హిందూ జాగృతం నాయకులు, గ్రామ పెద్దలు, యువత మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శివారాధనలో భాగమయ్యారు. మాస శివరాత్రి సందర్భంగా నిర్వహించిన ఈ మహారుద్రాభిషేకాలు, జలాధివాస కార్యక్రమాలు భక్తిపారవశ్యంతో విజయవంతంగా ముగిశాయి.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై ఇంటింటా అవగాహన

**జీడిమెట్లలో ఓటర్లను కలిసి సూచనలు చేసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వీరారెడ్డి నరేందర్ రెడ్డి**

**-ఓటరు నమోదు ప్రక్రియలో ప్రజలకు అవసరమైన సహాయం అందించిన నాయకులు**

**-ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు విలువైనదని అవగాహన**

**-జీడిమెట్ల నూట ముప్పై రెండో డివిజన్‌లో విస్తృత ప్రచారం**



జీడిమెట్ల, జులై 13 (విజన్ ఆంధ్ర): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా జీడిమెట్ల నూట ముప్పై రెండో డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వీరారెడ్డి నరేందర్ రెడ్డి ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లతో మాట్లాడిన ఆయన, అర్హులైన ప్రతి ఒక్కరూ లెక్కింపు దరఖాస్తు పత్రాన్ని తప్పనిసరిగా స్వీకరించి, పూర్తి వివరాలతో నింపి నిర్ణీత గడువులోగా సంబంధిత బూత్ స్థాయి అధికారికి అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఓటర్లకు వారి పోలింగ్ కేంద్రాల వివరాలు, ఓటరు జాబితాలో పేరు నమోదైందో లేదో నిర్ధారించుకునే విధానం, దరఖాస్తు పత్రాలను సక్రమంగా పూరించే విధానంపై స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు. అవసరమైన చోట ప్రజలకు ప్రత్యక్షంగా సహాయం అందిస్తూ సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు నమోదు కావడం అత్యంత ముఖ్యమని వీరారెడ్డి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటర్ల అవగాహన అత్యంత అవసరమని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని ఆయన సూచించారు.

# ఓటరు నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యానికి తావులేదు




## - సాదుల పవన్ కుమార్

నంగునూరు మండలం జూలై 13 విజన్ ఆంధ్ర : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ను అత్యంత కచ్చితత్వంతో చేపట్టి, ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించాలని సూచించారు. సోమవారం నంగునూరు మండల కేంద్రంలో పర్యటించిన ఆయన, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ విధానాన్ని పరిశీలించడంతో పాటు హెల్ప్‌డెస్క్‌ల పనితీరును తనిఖీ చేశారు. అనంతరం బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు) మరియు సిబ్బందితో మాట్లాడి, ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు.

ఈ సందర్భంగా సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత కలిగిన యువతి, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడూ ఆ హక్కును వినియోగించుకునేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

ఇంటింటికీ వచ్చే బీఎల్‌వోలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని, ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో నింపి అప్పగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిర్లక్ష్యం వల్ల ఓటరు జాబితాలో పేరు నమోదు కాకపోవడం లేదా ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంటుందని ప్రజలకు అవగాహన కల్పించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. హెల్ప్‌డెస్క్‌ల ద్వారా ఓటర్లకు నాణ్యమైన సేవలు అందిస్తూ, వారి సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతం కావాలంటే అధికారులు, బీఎల్‌వోలు, రాజకీయ పార్టీల బీఎల్ఏలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సాదుల పవన్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నితీష్, జీపీఓ దేవరాజు, ఎఫ్ఏ నరసింగరావు, బీఎల్‌వోలు రాజమల్లవ్వ, విమల, ఎస్. లక్ష్మి, ఎం. లక్ష్మి, సీఏస్‌లు డి. రేణుక, జహీర్, స్వప్న, సుజాత, లావణ్య, బిల్ కలెక్టర్ అశోక్ కుమార్, లవన్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



కుల్కచర్ల, జూలై, 13 ( విజన్ ఆంధ్ర): అన్నదాతల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాంరెడ్డిపల్లి సర్పంచి నర్సిములు యాదవ్ తెలిపారు. కుల్కచర్ల మండలం రాంరెడ్డిపల్లి గ్రామంలో పలువురు రైతులకు పశువుల షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ... రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిధులు వెచ్చించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే పాడి రైతులు, చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించడానికి ఇలాంటి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కేశవులు, గ్రామ ప్రజలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందుల పంపిణీ



చౌటకూర్ జూలై 13 (విజన్ ఆంధ్ర):- మండలంలోని బొమ్మరెడ్డిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో సోమవారం నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జైపాల్ నాయక్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే నులిపురుగుల నివారణకు క్రమం తప్పకుండా మందులు తీసుకోవడం అవసరమని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ వైద్యుడు డాక్టర్ మహేష్ కుమార్, ఏఎన్ఎం సృజన, ఆశా కార్యకర్త మోనిక, ఆశ్రమ పాఠశాల సిబ్బంది బాబ్యా, ఆంజనేయులు, సురేందర్, జోగినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యమే లక్ష్యం

### -మల్యాల జెడ్పీహెచ్ఎస్‌లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



మల్యాల, జూలై 13 (విజన్ ఆంధ్ర): మల్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 1 నుండి 19 సంవత్సరాల లోపు వయసున్న విద్యార్థులందరికీ ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ?ఈ సందర్భంగా వైద్య సిబ్బంది విద్యార్థులకు నులిపురుగుల నివారణపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని, తద్వారా పిల్లల్లో వచ్చే రక్తహీనత, పోషకాహార లోపం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలను సమర్థవంతంగా అరికట్టవచ్చని వారు వివరించారు. ?ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొట్ల జయ, ఉపసర్పంచ్ కటకం వినయ్, ఏఎన్ఎం జమున, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పీహెచ్సీ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ - వైద్య రంగాలకు కొత్త ఊపు



- రైతులకు విద్యుత్.. గ్రామీణులకు మెరుగైన వైద్యం
- రైతు సంక్షేమం--ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం
- పట్లూరులో రూ.3.4 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన
- మర్పల్లిలో రూ.25 లక్షలతో పల్లె దవాఖాన ప్రారంభించిన తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

మర్పల్లి, జూలై 13 (విజన్ ఆంధ్ర): గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. సోమవారం మర్పల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన పట్లూరు గ్రామంలో రూ.3.4 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ ఉపకేంద్రం అందుబాటులోకి రావడంతో పట్లూరు పరిసర గ్రామాల రైతులు, విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న తక్కువ వోల్టేజ్, విద్యుత్ అంతరాయాలు, లోడ్ సమస్యలు తొలగిపోతాయని, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందని ఆయన తెలిపారు.అనంతరం మర్పల్లి మండల కేంద్రంలో సుమారు రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం (పల్లె దవాఖాన) స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు గ్రామస్థాయిలోనే అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గర్భిణీ స్త్రీలకు అవసరమైన ఆరోగ్య పరీక్షలు, సాధారణ వైద్య పరీక్షలు, చిన్నపిల్లలకు వ్యాక్సినేషన్, తల్లి--శిశు ఆరోగ్య సేవలు, ఇతర ప్రాథమిక వైద్య సేవలను పల్లె దవాఖానలో వైద్య సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి అందిస్తారని తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. చిన్న చిన్న అనారోగ్య సమస్యలకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామస్థాయిలోనే చికిత్స అందుబాటులోకి రావడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.తదుపరి సిరిపురం గ్రామంలో మార్కండేయ ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. మర్పల్లి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్ అనారోగ్యంతో బాధపడుతూ ఉండగా న ఆయన నివాసం వద్ద స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పరామర్శించారు. ఇటీవల షాపూర్ గ్రామానికి చెందిన కేతావత్ విట్టల్ , మరో యువకుడు హైదరాబాదులో యాక్సిడెంట్లో చనిపోవడంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి అన్ని విధాలుగా అండదండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నో ని య ం ర్ నాయకులు గూడెం రాములు యాదవ్, పీఆర్‌డీఈ శ్రీనివాస్, డీఎంహెచ్‌వో సుధాకర్ లాల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మల సురేష్ యాదవ్, సర్పంచుల మండల అధ్యక్షుడు రఫీ, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, మర్పల్లి సర్పంచ్ రామేశ్వర్, మల్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, పరశురాం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోటిగారి జగదీశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు సుభాష్ యాదవ్, రవి, నాగేష్,శేఖర్ యాదవ్, దివాకర్, ఉపసర్పంచ్ కొప్పుల ప్రభు, బీసీ సెల్ అధ్యక్షుడు సర్వేశ్, గ్రామ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, గ్రామ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సలీం, వార్డు సభ్యులు మహిపాల్, భరత్, మారుతి, దామోదర్, శివ, శేఖర్ గోపాల్ నాయక్, పాండు నాయక్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు నజరుద్దీన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తలే పార్టీకి వెన్నుముక
### మాజీ ఎమ్మెల్యే వంశీ చందర్ రెడ్డి

తలకొండపల్లి,జులై13(విజన్ ఆంధ్ర) ; ఇటీవల మిడ్జిల్లో జరిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ సందర్భంగా దురదృష్టవశాత్తు మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త తలకొండపల్లి మండల పరిధిలోని గట్టిప్పలపల్లి కి చెందిన ఏదుల శంకర్ మృతి చెందిన విషయం తెలుసుకొని సోమవారం కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు చల్ల వంశీచందర్ రెడ్డి ఆయన నివాసానికి వెల్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, వారికి కొండంత ధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా వంశీ చందర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కొరకు కష్టపడే కార్యకర్తలకు నాయకులకు పార్టీ వెన్నంటే ఉండి కార్యకర్తల బాగోగులు చూస్తూ వారికి కొండంత అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## నాతరి స్వామి జన్మదినం సందర్భంగా
# అల్పాహారం పంపిణీ



బెల్లంపల్లి, జులై 13 విజన్ ఆంధ్ర : టీపీసీసీ రాష్ట్ర క్యాంపెయిన్ ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి పట్టణ తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ చౌరస్తా మార్కెట్ ప్రాంతంలో 300 మందికి పైగా ఉచితంగా అల్పాహారం పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రంగ రామన్న, కంటెవాడ నాగేష్ కుమార్, రత్నం రాజన్న, గెల్లీ జయరాం యాదవ్, భోగ శ్రీనివాస్, లింగాల రాజేశం, నాగులు లింగయ్య, కందుల సత్తయ్య, ఏనుగు నరేష్, ఎలిగేటి మల్లేష్, భీమిని కనకయ్య గౌడ్, గర్రెపల్లి శ్రీనివాస్, గైని మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

## విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కారేపల్లి,జులై 13(విజన్ ఆంధ్ర) : చిన్నారుల ఆరోగ్యం,పోషకాహార స్థితి మెరుగుపడేందుకు డీవార్మింగ్ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని కారేపల్లి సర్పంచ్ మేదరి టోనీ అన్నారు. సోమవారం సింగరేణి మండల పరిధిలోని జడ్.పి.హెచ్. ఎస్,ఆదర్శ పాఠశాల,ప్రభుత్వ, ప్రైవేట్,గురుకుల,పాఠశాలల్లో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కారేపల్లి సర్పంచ్ మేదరి టోనీ నులి పురుగుల నివారణ ప్రాధాన్యతను వివరించి ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. మాత్రలు తీసుకోని విద్యార్థులందరికీ ఈ నెల 20వ తేదీన నిర్వహించే మాప్-అప్ డే సందర్భంగా తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సురేష్,ఉపసర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి,ఏఎన్ఎంలు అనిత,లలిత ఆశాలు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్ల ఆక్రమణలపై సీపీఐ గళం

**కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌కు సమగ్ర వినతిపత్రం**
**-ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం.. వెంటనే తొలగించాలని డిమాండ్**
**-పైప్‌లైన్ రోడ్, బీరప్పనగర్‌లో మళ్లీ పెరుగుతున్న ఆక్రమణలపై ఆందోళన**
**-ప్రజా ప్రయోజనాల పరిరక్షణకు పక్షపాతం లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు వినతి**



కుత్బుల్లాపూర్, జులై 13 (విజన్ ఆంధ్ర) : కుత్బుల్లాపూర్ జోనల్ పరిధిలోని చింతల్, మహాదేవపురం, గాజులరామారం సర్కిళ్లలో రహదారులను ఆక్రమిస్తూ అక్రమ నిర్మాణాలు విస్తరిస్తుండటంపై సీపీఐ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆక్రమణల కారణంగా ప్రజలు నిత్యం తీవ్ర రాకపోకల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం గతంలో సంబంధిత సర్కిల్ డిప్యూటీ కమిషనర్ల కార్యాలయాలకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని విమర్శించారు. దీంతో సీపీఐ ప్రతినిధి బృందం జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌ను కలిసి సమగ్ర వినతిపత్రం అందజేసింది. ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న రహదారి ఆక్రమణలను తక్షణమే తొలగించడంతో పాటు, భవిష్యత్తులో కొత్తగా ఎలాంటి అక్రమ నిర్మాణాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. జగద్గిరిగుట్ట పరిధిలోని పైప్‌లైన్ రోడ్, సీపీఐ కార్యాలయం సమీపం, బీరప్పనగర్ ప్రాంతాల్లో ఇటీవల అభివృద్ధి చేసిన రహదారులపై మళ్లీ ఆక్రమణలు జరుగుతున్నాయని నాయకులు వివరించారు. గతంలో మున్సిపల్ అధికారులు చేపట్టిన చర్యలు నామమాత్రంగానే ఉండటంతో ప్రస్తుతం తాత్కాలిక ఆక్రమణలు శాశ్వత నిర్మాణాలుగా మారే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాల విషయం స్థానిక అధికారులకు తెలిసినా సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని, దీంతో ప్రజల్లో అధికారుల పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠ దెబ్బతినకుండా అధికారులు పక్షపాతం లేకుండా విధులు నిర్వహించి ప్రజా ప్రయోజనాలను కాపాడాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. అదేవిధంగా రాగి నారాయణరెడ్డి నగర్‌లో బాక్స్ నాళా నిర్మాణ పనుల కోసం తవ్విన రహదారిని ఇప్పటికీ పునరుద్ధరించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దెబ్బతిన్న రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తొలగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబు, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు సదానంద్, సహదేవరెడ్డి, వెంకటేష్, కొండయ్య, శ్రీనివాస్, జంబు, మహేష్, యాగంటి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎస్సై



ములుగు : ములుగు పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్ఓగా నియమితులైన ఎస్. వెంకటేష్ సోమవారం జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్‌నాథ్, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ములుగులో ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయడంతో పాటు నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. ప్రజా భద్రతకు అంకితభావంతో పనిచేస్తానని ఎస్సై వెంకటేష్ తెలిపారు.

## క్రీడాకారున్ని అభినందించిన వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి

వనపర్తి బ్యూరో జులై 13 (విజన్ ఆంధ్ర) : ఇండియా సేలార్ నీ అభినందించిన వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి, వచ్చేనెల ఆగస్టు 4 నుండి 8 వరకు మలేషియాలో జరుగుతున్న ఏషియన్ సేలింగ్ ఛాంపియన్షిప్ పోటీలకు భారతదేశం తరపు నుండి అండర్ 19 సీనియర్ విభాగంలో వనపర్తి పట్టణ టీచర్స్ కాలనీకి చెందిన కలవరాల అభిరామ్ సన్నాఫ్ కరాటే శేఖర్ ఎంపికయ్యారు. ఎమ్మెల్యే తూడిమెగా రెడ్డి ఇండియా సేలైర్ కలవరాలు అభిరామ్ అభినందించారు. కార్యక్రమంలో 26 వార్డు కౌన్సిలర్ విజయ్, బాక్సింగ్ కోచ్ పురుషోత్తం గౌడ్ గారు మరియు కరాటే ఒ కిక్ బాక్సింగ్ కోచ్ కరాటే శేఖర్ తదితరులు పాల్గొన్నారు





## చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి
### -సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్

ముధోల్: 13జూలై:విజన్ ఆంధ్ర : 1-19 ఏండ్ల గల పిల్లలకు అల్పెండజోల్ మాత్రలు తప్పని సారిగా వేయించాలని అష్ట గ్రామ సర్పంచ్ రావుల లావణ్య - శ్రీనివాస్ అన్నారు. సోమవారం నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు సర్పంచ్ ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎదుగుతున్న చిన్నారులకు ఈ మాత్రలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పేగు పురుగుల నివారణకు ఆల్బెండజోల్ ఎంతో అవసరమన్నారు. తమ పిల్లలకు తల్లిదండ్రులు ఆల్బెండజోల్ కచ్చితంగా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం గంగామణి, అంగన్వాడీ టీచర్లు దమయంతి, సంగీత, ఆయా సుజాత, ఆశ వర్కర్స్ లలిత, సుగుణ, కవితలు పాల్గొన్నారు

## ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చంద్రం గౌడ్ ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక

చిన్నశంకరంపేట (విజన్ ఆంధ్ర) జూలై 13: చిన్నశంకరంపేట మండల టి యు డబ్ల్యూ జే (ఐ జే యు) ప్రెస్ క్లబ్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంధిగారి చంద్రం గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా వెంకన్న బాబు, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి యాదగిరి, ఉపాధ్యక్షులుగా రాచర్ల నరేందర్, అరుణ్ యాదవ్, గిరకల యాదగిరి, సలహాదారులుగా తాటికొండ సుధాకర్, మురళి, కోశాధికారిగా నరేష్ గౌడ్, కార్యదర్శిగా పడిగాజి సందీప్ కుమార్, ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమ్మరి కార్యవర్గ సభ్యులుగా కమ్మరి దేవరాజ్, సంతోష్ గౌడ్, కృష్ణ గౌడ్, ప్రవీణ్ కుమార్, కుమ్మరి నవీన్, లక్ష్మణ్ లను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చంద్ర గౌడ్ మాట్లాడుతూ జర్నలిస్టుల నిరంతరం పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా జాయింట్ సెక్రెటరీ ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.

# వ్యక్తిగత పరిశుభ్రతతోనే నులిపురుగుల నివారణ

## - మండల వైద్యాధికారి డా. బాలకృష్ణ

## - జాతీయ నులిపురుగుల దినోత్సవం

ఏన్కూరు, జూలై 13(విజన్ ఆంధ్ర): వ్యక్తిగత పరిశుభ్రతతోనే నులిపురుగులను నివారించవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక కస్తూరిబా విద్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి పల్లి భాగ్యశ్రీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యాలయంలోని విద్యార్థినులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. నులిపురుగుల కారణంగా విద్యార్థుల్లో రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం లాంటి సమస్యలు తలెత్తుతాయని అవగాహన కల్పించారు. అదేవిధంగా నులిపురుగుల నిర్మూలన ద్వారా పిల్లల్లో రక్తహీనత తగ్గడం, పోషకాహారం శరీరానికి సక్రమంగా అందడం, శారీరక, మానసిక ఎదుగుదల మెరుగవడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, వార్డెన్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# క్రాప్ లోన్‌లో రైతు భరోసా జమ చేయొద్దు

**- నార్నూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా**

**- రైతుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పోలీసుల హామీ**

**- హామీతో విరమించిన ఆందోళన**



నార్నూర్,జూలై 13(విజన్ ఆంధ్ర):క్రాప్ లోన్ బకాయిల పేరుతో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా నిధులను సర్దుబాటు చేయవద్దని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లో సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు భిక్కు రాథోడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. రైతులకు అందాల్సిన సంక్షేమ నిధులను రుణాల పేరుతో బ్యాంకులు మినహాయించడం సరికాదని వారు ఆందోళన వ్యక్తం చేశారు.సమాచారం అందుకున్న ఎస్సై శ్రీ సాయి సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న నాయకులతో చర్చించారు. అనంతరం సంబంధిత బ్యాంకు ఫీల్డ్ అసిస్టెంట్‌తో మాట్లాడి రైతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో బీజేపీ నాయకులు ధర్నాను విరమించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీకాంత్, రాజు,దేవిదాస్,ప్రకాష్,సంతోష్,సావన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ల పట్టివేత...



బోధన్, జులై 13(విజన్ ఆంధ్ర) : మందర్నా గ్రామ శివారు మంజీరా నది నుండి బోధన్ వైపు సోమవారం అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను బోధన్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని సమాచారం మేరకు బోధన్ రూరల్ ఎస్ఐ రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను సాలంపాడ్ గ్రామం దగ్గర గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## అమలుకు నోచుకోని జర్నలిస్టుల సంక్షేమ హామీలు నిరసనగా టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో

# మేడ్చల్ కలెక్టరేట్ ముందు ధర్నా



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జులై 13 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నిర్దిష్టంగా అమలుచేయాలని మీడియా స్వేచ్ఛ కాపాడాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ( టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాపిత పిలుపులో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని భారీగా నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఎస్ కె సలీమా, గుమ్మడి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, కార్యదర్శి బనావత్ రవి నాయక్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అర్హులైన వారందరికీ వెంటనే అక్రిడేషన్ ఇవ్వాలని, హెల్త్ కార్డులు, పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయితీలు ఇండ్ల స్థలాల హామీలు అమలు విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవరిస్తుందని అన్నారు. ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని లేదంటే ఆందోళ తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా, నియోజక వర్గం ఇంచార్జ్ లు నాయకులు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లాలో ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలి

**ఎంపీ ఈటెల రాజేందర్ ను కలిసిన ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ,**



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూలై 13 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్స్ ఆధ్వర్యంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ,ఈటల రాజేందర్ కలసి , మేడ్చల్ జిల్లాలో ఇప్పటివరకు ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయలేదు కనుక తమరు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని కోర్టును ఏర్పాటు చేయాలని, తమరి సహకారాలు అందించాలని కోరారు. ఇప్పటివరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే కోర్టు నడుస్తున్నందున కేసులు ఎక్కువై ఎస్సీ ఎస్టీ కేసులు ఆలస్యం అవుతున్నందున, మేడ్చల్ జిల్లాలో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలని తమరు తెలంగాణ ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించాలని విన్నవించారు. అలాగే మేడ్చల్ జిల్లాలో బాలరక్ష భవన్ లేనందున జిల్లాలో రక్షక్ భవనం ప్రత్యేక భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటర్ కమిటీ మెంబర్ ధనరాజ్ నాయక్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ రామ్మోహన్ రావు , పాల్గొన్నారు.

# విట్టోలి తాండలో ఓటరు జాబితా సవరణ

## - ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం



ముధోల్ :జూలై 13:విజన్ ఆంధ్ర : ముధోల్ నియోజకవర్గంలోని విట్టోలి తాండ గ్రామపంచాయతీలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ వేగవంతమైంది. ఓటరు జాబితా సవరణలో భాగంగా దరఖాస్తుల స్వీకరణను అధికారులు ముమ్మరంగా చేపట్టారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముధోల్ నియోజకవర్గంలోని ముధోల్ మండలం విట్టోలి తాండ గ్రామపంచాయతీలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ఓటరు జాబితా సవరణలో భాగంగా దరఖాస్తుల స్వీకరణను అధికారులు వేగవంతంగా చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శి సాహెబ్రావు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అవసరమైన దరఖాస్తులను సకాలంలో సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ బీఎల్ఓ రాథోడ్ కౌసల్యా, బూత్ ఏజెంట్లు రాథోడ్ గణపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ముధోల్ నియోజకవర్గ పరిధిలోని ఇతర గ్రామపంచాయతీల్లో కూడా ఎస్ఐఆర్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

# జా తీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం



భూపాలపల్లి జిల్లా జులై 13 (విజన్ ఆంధ్ర ) జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేంద్రంలో పి ఎచ్ సి డాక్టర్ రోహిణి హెల్త్ అసిస్టెంట్ శ్యామ్ మరియు మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్యవైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ తో కలిసి నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పిల్లలకు ఆల్బండజోల్ టాబ్లెట్ లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ పిల్లలు గోర్లు శుభ్రంగాను చిన్నవిగా ఉ ంచాలని, శుభ్రమైన నీటిని త్రాగాలని ,తినే పదార్థాలపై మూతలు పెట్టాలని పండ్లు కూరగాయలను శుభ్రమైన నీటితో కడగాలని భోజనం చేసేముందు మరుగుదొడ్డిని ఉపయోగించిన తర్వాత చేతులను శు భ్రంగా కడుకోవాలని బహిరంగ మలవిసర్జన చేయరాదన్నారు ,మరుగుదొడ్డిని ఉపయోగించాలని పాదరక్షలు ధరించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు.

# ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన మహిళలకు వరం

- ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ చేసిన
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు.రామచంద్రారెడ్డి

అయిజ జూలై 13 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణ కేంద్రంలో బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు అర్హులైన మహిళలకు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా అర్హులైన మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా అర్హులైన మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేసి ప్రధాని మోదీజీ 18 రకాల చేతి వృత్తుల వారికి ఉపాధి కల్పించే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. వారి కుటుంబాల ఆదాయం పెంపే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తోంది అని అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా లో 6000 మంది నమోదు చేసుకున్నారు. ఇప్పటికే 4500 మందికి లక్ష రూపాయలు లోన్ తీసుకొని చాలా మంది రీపేమెంట్ చేశారని, వారికి త్వరలో 2 లక్షల నుండి 3 లక్షల వరకు లోన్ ఇస్తారు అని అన్నారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు, కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా సంప్రదాయ వృత్తిదారులకు నైపుణ్య శిక్షణ, ఆధునిక పరికరాల కొనుగోలుకు ఆర్థిక సహాయం, బ్యాంకు రుణ సౌకర్యం, డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహకాలు వంటి పలు ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కిషాన్మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడికొండ భీమ్ సేన్ రావు, అయిజ పట్టణ అధ్యక్షుడు తెలుగు నర్సింహ,నాయకులు ప్రదీప్ స్వామి,కంపాటి భగత్ రెడ్డి,ఖుషీ,ప్రదీప్ శెట్టి, సి నరసింహ,శ్రీకాంత్,వర్మచారి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# చిన్నారుల ఆరోగ్యమే దేశ భవిష్యత్తు

-నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

-మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్

అయిజ జూలై 13 (విజన్ ఆంధ్ర): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా అయిజ పట్టణంలోని భరత్ నగర్ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అయిజ మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్ పాల్గొని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా చైర్మన్ సీఎం సురేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండాజోల్ మాత్ర వేయించాలని కోరారు. చిన్నారుల ఆరోగ్యమే కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తుకు పునాదని, నులిపురుగుల నివారణతో రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల సమస్యలను నివారించవచ్చని అన్నారు.



జులై 13న మాత్రలు తీసుకోలేని పిల్లలకు జులై 20న నిర్వహించే మాప్-అప్ డేలో మాత్రలు అందజేస్తామని వైద్యాధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రజాక్, డాక్టర్ కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు అశ్వ పెద్దయ్య, నరేష్, నాగరాజు, వైద్యులు డా. కిరణ్, డా. తరుణ్, ఎంపీ హెచ్ఈఓ ఒబులేష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ముధోల్, 13 జూలై: విజన్ ఆంధ్ర : మండల కేంద్రమైన ముధోల్ లోని మున్నూరు కాపు సంఘం నుండి కామాన్ వరకు సీసీ రోడ్డు పనులను సర్పంచ్ షబానా - ఏజాజోద్దీన్ సోమవారం ప్రారంభించారు. ఇటీవల ఎమ్మెల్యే రామారావు పటేల్ సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన నిధులతో పనులను ప్రారంభించుకున్నా రు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. సీసీ రోడ్డు లేని కాలనీలో సీసీ రోడ్లను మంజూరు చేయించి వేయించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా డ్రైనేజీలు లేని కాలనీలో డ్రైనేజీ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నివారించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సహకారంతోనే గ్రామాభివృద్ధికి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, మున్నూరు కాపు సంఘం టౌన్ అధ్యక్షుడు భాస్కరోళ్ళ లవన్,



వార్డ్ సభ్యులు ధర్మపురి శ్రీనివాస్,నాయకులు తాటివార్ రమేష్, శంకర్,జీవన్, బాబు, నరసయ్య, దశరథ్, నవీన్, సాయిలు తోపాటు తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర విశాల ప్రయోజనాల సాధనే లక్ష్యంగా పని చేయాలి...

హైదరాబాద్ మెట్రో ఫేజ్-x స్వాధీనం, మెట్రో ఫేజ్-xx విస్తరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో చర్చల సరళిని సీఎం ఎంపీలకు వివరించారు. ఇందుకు సంబంధించి వాదీxజూరాని కన్సల్టెంట్‌గా నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, ఆ ప్రక్రియ త్వరగా ముందుకు సాగేలా చూడాలని ఎంపీలకు సీఎం సూచించారు.

ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలకు సీఎం విజ్ఞప్తి చేశారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో 95 శాతం భూ సేకరణ పూర్తయిందని.. ఆ పనుల ప్రారంభానికి, దక్షిణ భాగం ఆర్ఆర్ఆర్ భూ సేకరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపాల్సి ఉందని సీఎం తెలిపారు. ఈ విషయంలో ఎంపీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం సూచించారు.

మూసీ పునరుజ్జీవనం పనుల్లో మొదటి దశ టెండర్ల దశకు వచ్చిందని సీఎం తెలిపారు. ఈ పనులను అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద తీసుకునే విషయంలో కేంద్ర అప్రూవల్ లెటర్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఎంపీలు ఈ విషయంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలని సూచించారు. అంతరాష్ట్ర నదీ జలాల విషయమై ఇటీవల కర్ణాటకలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో ఏపీ, కర్ణాటక ముఖ్యమంత్రులతో చర్చించిన అంశాలను సీఎం ఎంపీలకు వివరించారు. తుంగభద్ర నుంచి తెలంగాణకు 15.09 టీఎంసీల నీరు రావల్సి ఉన్నా పూడికతో 5 టీఎంసీలకు మించి రావడం లేదన్నారు. డ్యామ్‌తో పాటు కాలువల్లో పూడిక తొలగింపునకు ఏపీ, కర్ణాటక సహకరించేలా ఒప్పించాలని సీఆర్ పాటిల్‌ను కోరామని, ఈ విషయంపైనా ఎంపీలు కేంద్ర మంత్రిని కలవాలని సీఎం సూచించారు. నదుల అనుసంధానంలో గోదావరి నుంచి నాగార్జున సాగర్‌కు నీళ్లు తీసుకునే విషయంలో ఛత్తీస్‌గఢ్‌ను ఒప్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకుందని సీఎం తెలిపారు. గోదావరిలో ఛత్తీస్‌గఢ్‌కు 300 టీఎంసీల వాటా ఉందని, వాటిని ఛత్తీస్‌గఢ్ వాడుకోవడం లేదన్నారు. భవిష్యత్‌లో 160 టీఎంసీలు వాడుకున్నా 143 టీఎంసీలు మిగులు ఉంటాయన్నారు. అందులో తెలంగాణకు 43 టీఎంసీలు లభించే అవకాశం ఉందన్నారు. గోదావరి నుంచి ఏపీ ప్రాంతం మీదుగా తమిళనాడు, కర్ణాటక, కేరళకు నీరు తీసుకెళ్లే గోదావరి-కావేరి అనుసంధానం ఉందన్నారు. ఈ విషయంలో ఎంపీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం సూచించారు. ఇక్కడ నీళ్లు ఛత్తీస్‌గఢ్ వి అయితే నిధులు కేంద్రానివని... ఆ రెండింటిని తెలంగాణకు అనుకూలంగా సాధించాలని సీఎం అన్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాజెక్టులకు ఏపీ నిరభ్యంతర పత్రాలు (ఎన్వోసీ) ఇవ్వాల్సి ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ విషయంపైనా కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్, ఏపీ ముఖ్యమంత్రి చర్చించామన్నారు. వారు సూత్రప్రాయంగా అంగీకరించారని, ఎన్వోసీలు వస్తే వాటికి ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని సీఎం అన్నారు. తుమ్మిడి హెట్టి ప్రాజెక్టుకు సంబంధించి 150-151 అడుగుల్లో నిర్మించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో భేటీ అవుదామని ఎంపీలతో సీఎం అన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బెంగళూరు, చెన్నై, ముంబయిలకు వెళ్లే బుల్లెట్ రైళ్లకు సంబంధించి ఎలైన్‌మెంట్లు కొలిక్కివచ్చాయని సీఎం తెలిపారు. ఆదిలాబాద్ డిఫెన్స్ ఎయిర్‌పోర్ట్, వరంగల్ ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూ సేకరణ పూర్తి చేశామని సీఎం తెలిపారు. ఈ ఎయిర్‌పోర్టుల్లో ఎంఆర్వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్ హాలింగ్), ఎయిర్ కార్గోలు ఏర్పాటుచేయాలని కోరుతున్నామని.. ఈవిషయంపైనా ఎంపీలు దృష్టిసారించాలని సీఎం కోరారు.

రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంతో సహకరిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పార్టీలకు అతీతంగా ఎంపీలకు అవసరమైన సమాచారం అందించడానికి ఢిల్లీ తెలంగాణ భవన్‌లో కోఆర్డినేషన్ కు ఐఏఎస్ అధికారి అద్వైత్ కుమార్ సింగ్‌ను నియమించామని సీఎం చెప్పారు. పెండింగ్ అంశాలకు సంబంధించి ఏ సమాచారం కావాలన్నాఎంపీలు ఆయన దగ్గర నుంచి తీసుకోవచ్చని సూచించారు. పార్టీలతో సంబంధం లేకుండా ఎంపీలు అడిగే సమాచారం వేగంగా వారికి అందజేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. అన్ని పార్టీల ఎంపీలను సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ఎంపీల కన్వీనర్ డాక్టర్ మల్లు రవికి సీఎం సూచించారు.

సమావేశంలో ఎంపీలు అడిగిన ప్రతి సమాచారం అందజేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా తాము కేంద్ర ప్రభుత్వంతో సహకార ధోరణితోనే ముందుకు సాగుతున్నామని తెలిపారు. రాష్ట్రానికి చెందిన వివిధ అంశాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి గతంలో పంపిన లేఖలు, ప్రస్తుత స్థితిని తెలియజేస్తూ లేఖలు సిద్ధం చేసి పార్లమెంట్ సమావేశాల సమయంలో ఎంపీలకు అందుబాటులో ఉంచాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

గద్వాల దగ్గర మూతపడిన ఆయిల్ మిల్లు పునరుద్ధరణపై ఎంపీ డాక్టర్ మల్లు రవి అధికారులను ప్రశ్నించారు. 7-8 నెలల్లో పునరుద్ధరణ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. పార్లమెంట్‌లో ప్రశ్నలు వేయడానికి వీలుగా ఈ సమావేశాలు చాలా ముందుగా ఏర్పాటుచేయాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో పండే ధాన్యానికి తగిన మిల్లింగ్ సామర్థ్యం లేదని, స్టోరేజీ సమస్య ఉందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రొటోకాల్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీలంతా ఏదో ఒక స్టాండింగ్ కమిటీ, కన్సల్టెన్సీ కమిటీల్లో సభ్యులుగా ఉంటారని, ఆ సమాచారం తీసుకొని ఆయా అంశాలకు సంబంధించిన పెండింగ్ విషయాలు తెలియజేస్తే సమావేశాల్లో తాము చర్చించేందుకు వీలుంటుందని ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి అన్నారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి డిజైన్లలోనే లోపాలున్నాయని.. ఈ అంశంపై నిపుణులతో కమిటీ వేసి అధ్యయనం చేయించాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సూచించారు. సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, ఈటల రాజేందర్, కడియం కావ్య, రామసహాయం రఘురామిరెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నూతన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి లకు ఘనంగా సన్మానించిన మంత్రి వాకిటి శ్రీహరి



మక్తల్, జులై 13 విజన్ ఆంధ్ర : లైన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ భీమా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమము తేదీ 12 జులై ఆదివారం రోజు పట్టం రవి కన్వెన్షన్ హాల్ నందు మాజీ అధ్యక్షులు లయన్
ఏ సత్యాంజనేయులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది.

ప్రోగ్రాం చైర్మన్ లయన్ జి .జయపాల్ రెడ్డి యొక్క స్వాగత ఉపన్యాసంతో కార్యక్రమం ప్రారంభమైనది. అదేవిధంగా లైన్స్ అంతర్జాతీయ సంస్థ వ్యవస్థాపకులు లయన్ మెల్విన్ జోన్స్ చిత్రపటానికి అతిథులచే పూలమాల సమర్పణ చేయడం జరిగింది

ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి లయన్ డాక్టర్ వాకిటి శ్రీహరి హాజరైనారు .
కార్యక్రమం ఉద్దేశించి వారు మాట్లాడుతూ సమాజంలో సేవ చేసేవాళ్లు చాలామంది ఉంటారు కానీ, సేవను పుచ్చుకునే వాళ్లు ఉన్నప్పుడే సేవ చేసే వారికి అవకాశం ఉంటుందని పుచ్చుకునేవారు లేనప్పుడు సేవ చేసే భాగ్యము కలగదని తెలియజేశారు.

అదేవిధంగా లైన్స్ ఐ హాస్పిటల్ నిర్మాణానికి ప్రస్తుతం నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి పరిసరాల్లో అర్ధ ఎకర స్థలము ఇవ్వడానికి అంగీకారం తెలియజేశారు.

ఇన్స్టలేషన్ ఆఫీసర్ లయన్ ఎం .ప్రేమ్ కుమార్ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ గారు నూతన అధ్యక్షులు
లయన్ టి నాగరాజు,
కార్యదర్శి లయన్ ఎస్ రమేష్ రావు,
కోశాధికారి లయన్ బి అంబాదాసు రావు
ఇతర కార్యవర్గము మరియు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ తో ప్రమాణస్వీకారం చేయించారు. మక్తల్ లైన్స్ క్లబ్ డిస్టిక్ 320 ఏ నందు అత్యుత్తమ సేవలకు పేరుగాంచినదని ఎన్నో అవార్డులు పొందినదని భవిష్యత్తులో కూడా నూతన కమిటీ మరియు సభ్యులు కలిసి లైన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ భీమాకు ఉత్తమ సేవల ద్వారా మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. అదే విధంగా క్లబ్ ఎక్స్టెన్షన్ చైర్మన్ సేవరత్న లయన్ నటరాజ్ పిడిజి ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా బీదవారికి వర్షం వస్తే గుడిసెలు కారకుండా అలాంటి కుటుంబాలను ఎంపిక చేసుకొని వారికి తాడిపత్రిలను అందించాలని క్లబ్ సభ్యులకు 15 తాడిపత్రిలను అందించారు
ఇట్టి సమావేశంలో నూతనంగా ఎంపికైన అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారి డాక్టర్స్ డే సందర్భంగా
లయన్ డా.పి.శ్రీరామ్
లయన్ డా .అశోక్
లయన్ డా .మణికంఠ గౌడ్ మరియు డా.టీ .అక్షయ్ కుమార్ గార్లను శాలువతో సత్కరించి సర్టిఫికెట్స్ అందజేశారు. నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన అధ్యక్ష కార్యదర్శి కోశాధికారి లను మంత్రి శాలువాతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా నూతన కార్యవర్గ సభ్యులు మంత్రి ని శాలువతో పూలకుండితో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 2026-27 సంవత్స రానికి గాను క్లబ్ యొక్క ఇంటర్నేషనల్ ఫీజు కు సంబంధించిన రెండు లక్షల 50 వేల రూపాయల చెక్కును మంత్రి చేతుల మీదుగా ఇన్స్టలేషన్ ఆఫీసర్
ఎం ప్రేమ్ కుమార్ పిడిజి కి అందించడం జరిగింది.

కార్యక్రమానికి విచ్చేసిన రీజియన్ చైర్ పర్సన్ లయన్ కే .మోహన్ గౌడ్ జోన్ చైర్ పర్సన్ లయన్ సరిత ను శాలువతో సత్కరించారు. ఇట్టి కార్యక్రమానికి నారాయణపేట క్లబ్ సీనియర్ సభ్యులు లయన్ ఆత్మారాం హెడికే, అధ్యక్షులు రవికుమార్ ఉట్కూర్ క్లబ్ అధ్యక్షులు జయసింహారెడ్డి,సభ్యులు వై జనార్దన్ రెడ్డి, మశ్చేంద్ర రెడ్డి, రాయచూర్ క్లబ్ నుండి
లయన్ పరిటాల రాము పాస్ట్ ఆర్ సి గారు హాజరైనారు. అదేవిధంగా మక్తల్ సీనియర్ లయన్ సభ్యులు వి నరేందర్,
డి బసవరాజ్ ,బి కొండయ్య, ప్రోగ్రాం కో చైర్మన్
జి శరణప్ప, ఎం .ఆర్ .రామచంద్రప్ప సిద్ది లింగయ్య, సుజాత మేడం అరుణ మేడం, జయశ్రీ మేడం, ఆడెం శ్రీనివాస్, కట్ట వెంకటేష్, పాపిరెడ్డి, డి.వి చారి,ఎం .వాదిరాజ్ అంజన్ ప్రసాద్, ఆడం సత్యనారాయణ, కోళ్ల వెంకటేష్, సుకన్య శేఖర్, కావలి తాయప్ప, తాన్సింగ్, భార్గవ్ రానా, కర్ని స్వామి, రమేష్ కుమార్, కాకులారం అశోక్, వట్టమ్ రతన్ కుమార్ గుప్తా,కే .రవికుమార్ గౌడ్ పాల్గొన్నారు కార్యక్రమానికి వ్యాఖ్యాతగా లయన్ ఏ .రవి కిరణ్ డీసీ మరియు లయన్ డి .వి .చారి ఫాస్ట్ ప్రెసిడెంట్ వ్యవహరించారు.

# పర్వతాపురంలో అడ్డగోలుగా బెల్టు షాపులు కుటుంబాల్లో గొడవలు

తెలకపల్లి, జులై 13 (విజన్ ఆంధ్ర) మండల పరిధిలోని పర్వతాపురం గ్రామంలో మద్యం బెల్టు షాపులు అడ్డగోలుగా వెలిశాయి నిత్యం పనులకు వెళ్లి ఇంటికి రాగానే దగ్గర్లో ఉండే బెల్టు షాపుల వద్ద మద్యం సేవిస్తున్నారు కొంతమంది రాత్రి పగలు మద్యం సేవిస్తూ ఇంటికి వెళ్లి భార్యా పిల్లలతో గొడవలకు దిగుతున్నారు తాగిన మైకంలో ఉన్న వారి నుండి బెల్టు షాపుల నిర్వాహకులు అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు బెల్టు షాపుల వల్ల గ్రామాల్లో నిత్యం గొడవలతో సతమతమవుతున్నారు మద్యం బెల్టు షాపుల వల్ల ప్రాణాలు సైతం గాల్లో కలిసిపోతున్నాయి, అధికారులు బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోకుండా ముడుపులతో సరిపెట్టుకుంటున్నారని గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బెల్ట్ షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఆపదలో ఉన్నవారికి అపర్ణ హస్తం

బూర్గంపాడు మండల ప్రతినిధి జూన్ 12 టవిజన్ ఆంధ్ర : ఆపదలో ఉన్నవారికి అపర్ణ హస్తం. ఎస్ కె లఫ జకాత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక గ్రామపంచాయతీలో బసప్ప క్యాంపులో ఈ కార్యక్రమం నిర్వహించారు ఎస్.కె. లఫ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్యాన్సర్ బాధ్యత కుటుంబానికి కుటుంబానికి 10,000 ఆర్థిక సహాయం

సారపాక: సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుండే ఎస్.కె. లఫ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్వహించబడుతున్న ఖజ ూ్రాణ ఖఖత్వఎ వీఋశ్రీఅఎ ాాంశీఎఋఖశీఱ ఆధ్వర్యంలో క్యాన్సర్ చివరి దశలో చికిత్స పొందుతున్న ఎస్.కె రిహానా కుటుంబానికి శనివారం 10,000 ఆర్థిక సహాయం అందజేశారు.

సారపాకలోని బసవప్ప క్యాంప్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించి తమ సంఘీభావాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అవసరంలో ఉన్న కుటుంబాలకు చేయూత అందించడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కార్మిక మైనారిటీ నాయకులు నాగుర్ వలి, లాల్ మెహమ్మద్, మెహబూబ్ అలీ, అజీజ్, బషారత్, అజీమ్, నషీర్, మెహబూబ్ ఖాన్ పాల్గొని బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

# ప్రయివేట్ పాఠశాల్లో అధిక ఫీజుల్ని నిరోధించాలి

పెబ్బేరు జులై 13 ( విజన్ ఆంధ్ర ) భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్)సిపిఎం పెబ్బేరు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పెబ్బేరు మండల విద్యా అధికారి ఎంఈఓ జయ రాములు కు విజ్ఞాపన పాత్రం సమర్పించారు.సిపిఎం పార్టీ ప్రతినిధి బృందం పెబ్బేరు మండలంలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలపై సర్వే నిర్వహించడం జరిగింది . సర్వేలో వచ్చిన సమస్యలను సిపిఎం పార్టీగా ఎంఈఓ జయ రాములు కు వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మండ్ల రాజు సిపిఎం కార్యదర్శి మాజీ ఎంపీటీసీ జి బాలయ్య మాట్లాడుతూ పెబ్బేరు మండలంలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంగిస్తూ ఇష్టారాజ్యంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ పేద విద్యార్థుల తల్లిదండ్రులను పీడిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు 21 వేల రూపాయలు నాలుగో తరగతి ఐదో తరగతి విద్యార్థులకు 30 వేల రూపాయలు పైతరగతులకు 50 వేల నుండి 60 వేల రూపాయల వరకు అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నారు పాఠ్యపుస్తకాల పేరుతో వేల వేల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారు నక్కల్ యూనిఫాంలో పేరుతో ప్రైవేటు పాఠశాల యజమాన్యమే వ్యాపారాలు చేస్తూ వేల రూపాయలు గడిస్తున్నారు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారు కోర్టు తీర్పు 25 శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్య అమలు చేయాలి కానీ వాటిని నిబంధనలకు ప్రైవేటు విద్యాసంస్థల యజమానులు పాటించటం లేదు నిబంధనల ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థలు ఏ తరగతి విద్యార్థికి ఎంత ఫీజు తీసుకోవాలో నోటీస్ బోర్డులో రాయాలని కోరారు ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీకి వ్యతిరేకంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సిపిఎం పోరాటాలు ఉధృతం హెచ్చరించారు ఈ సిపిఎం నాయకులు ఆర్ భాస్కర్ ఎం వెంకటస్వామి పి ఊసన్న జి మన్యం తదితరులు పాల్గొన్నారు



# ప్రాణం పోసుకుంటున్న రియల్ ఎస్టేట్ ను పాతాళానికి తొక్కుతున్న రేవంత్ రెడ్డి

## బిఆర్ఎస్ నాయకులు నందిమల్ల అశోక్

వనపర్తి బ్యూరో జులై 13(విజన్ ఆంధ్ర ):మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు క్రమేణా పుంజుకుంటున్న రియల్ ఎస్టేట్ ప్రభుత్వ నిర్ణయంతో రియల్ ఎస్టేట్ యజమానులు,మధ్యవర్తులు రోడ్డుపై పడాల్సివస్తుందని జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ విమర్శించారు. గతములో పాత వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ఎల్.ఆర్.ఎస్ ఫీజు కట్టుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వెసులుబాటు కల్పించారు కొద్దిగా ఉపశమనం కలిగి రియల్టర్స్,మధ్యవర్తులు ఊపిరి పీల్చుకొని కాస్తో కూస్తో వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు అని అశోక్ అన్నారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం అకస్మాత్తుగా జీవో తెరమీదికి తెస్తూ పాత వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ పై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించడం దారుణమని నందిమల్ల.అశోక్ ధ్వజమెత్తారు.స్వతహాగా ముఖ్యమంత్రి నేను రియల్ ఎస్టేట్ వ్యాపారి అని రియల్ ఎస్టేట్ రికార్డ్ స్థాయిలో అభివృద్ధిలోకి తీసుకొస్తానని ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల వ్యాపారం దారుణంగా నష్టపోయి అప్పులు చెల్లించలేక రియల్టర్స్ ఆత్మహత్యలు చేసుకున్నారు. రియల్ ఎస్టేట్ పై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది మధ్యవర్తులు,ఏజెంట్లు ఉపాధి లేక



సతమతమవుతున్నారని అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఒకనాడు ఏకరం కోటి రూపాయలు పలికిన ధరలు దారుణంగా పడిపోయి లక్షలకు కూడా ఎవ్వరూ కొనడం లేదని ఈ ప్రభావం అన్ని వ్యాపారాలపై పడి ప్రజల జీవన ప్రమాణాలు ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై అల్లాడుతున్నారని మార్కెట్లో ఒక్క రూపాయి కూడా అప్పు పుట్టక ఉన్న భూములు అమ్ముడుపోక తమ పిల్లలకు వివాహాలు,ఇంటి నిర్మాణాలు,పై చదువులు వాయిదా వేసుకొని తీవ్ర మనోవేదనకు గురి అవుతున్నారని అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా జి.ఓ ఉపసంహరించుకుని రియల్ ఎస్టేట్ పుంజుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని నందిమల్ల.అశోక్ డిమాండ్ చేశారు.



## మీనాబరం శివాలయంలో మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్

# ప్రత్యేక పూజలు

### ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్ష

జడ్చర్ల, జులై 13,(విజన్ ఆంధ్ర): జడ్చర్ల మండలం ఆల్వాన్‌పల్లి గ్రామంలోని ప్రాచీన, ప్రసిద్ధ మీనాబరం శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ శ్రీ మీనాంబరం శివునికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివుని అనుగ్రహంతో నియోజకవర్గ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజల సేవలో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## కోడుగల్ బాలికలకు నులిపురుగుల మాత్రల పంపిణీ

జడ్చర్ల, జులై 13,(విజన్ ఆంధ్ర): జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం కోడుగల్ ప్రైమరీ స్కూల్ లో జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పాఠశాలల్లో మాత్రల పంపిణీ ప్రైమరీ, జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది విద్యార్థులకు మాత్రలు వేసి అవగాహన కల్పించారు. సర్పంచ్ పాల్గొని అవగాహన ఈ కార్యక్రమంలో కోడుగల్ గ్రామ సర్పంచ్ గోదాల సాయి రెడ్డి పాల్గొన్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. అందరూ మాత్రలు తీసుకోవాలి అర్హులైన ప్రతి ఒక్కరూ మాత్రలు తీసుకునేలా చూడాలని సర్పంచ్ సూచించారు. నులిపురుగుల నిర్మూలనతో పిల్లల్లో పోషకాహార లోపం తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# అద్దె వాహనాల బిల్లులు పెంచాలి కలెక్టర్‌కు అద్దె వాహన యజమానుల సంఘం వినతి

మహబూబ్‌నగర్ అర్బన్ జులై 13 (విజన్ ఆంధ్ర) : రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలకు గత అనేక సంవత్సరాలుగా అద్దె ప్రాతిపదికన వాహనాలను అందిస్తున్న యజమానులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అద్దె వాహనాల హైర్ ఛార్జీలను ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పెంచడంతో పాటు, గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 15వ తేదీ నుంచి ప్రభుత్వ శాఖలకు అందిస్తున్న అద్దె వాహనాల సేవలను నిరవధికంగా నిలిపివేస్తామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, 2017 నుంచి ఇప్పటి వరకు అద్దె వాహనాల హైర్ ఛార్జీలలో ఎలాంటి పెంపు జరగలేదని తెలిపారు. అయితే గత తొమ్మిది సంవత్సరాల కాలంలో డీజిల్ ధరలు, వాహనాల విడిభాగాల ధరలు, మరమ్మతుల ఖర్చులు, ఇన్సూరెన్స్ ప్రీమియాలు, టైర్లు, ఇంజిన్ ఆయిల్, డ్రైవర్ల వేతనాలు, నిర్వహణ వ్యయాలు గణనీయంగా పెరిగాయని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వ శాఖలు ఇప్పటికీ 2017 నాటి అద్దె రేట్ల ప్రకారమే చెల్లింపులు చేస్తున్నాయని, దీంతో వాహనాల నిర్వహణ భారంగా మారి యజమానులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గత రెండేళ్లుగా అద్దె వాహనాలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పరిస్థితి మరింత దయనీయంగా మారిందని తెలిపారు. బ్యాంకు రుణాల ఈఎంఐలు, ఇన్సూరెన్స్, పన్నులు, నిర్వహణ ఖర్చులు, డ్రైవర్ల జీతాలు చెల్లించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో పలువురు వాహన యజమానులు అప్పుల పాలవుతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన అద్దె వాహన యజమానుల సంఘం సమావేశంలో సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఈ నెల 15వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అందిస్తున్న అద్దె వాహనాల సేవలను నిరవధికంగా నిలిపివేయాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. దీనిపై అధికారికంగా జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని అద్దె వాహనాల హైర్ ఛార్జీల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయడంతో పాటు, వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను అత్యవసరంగా విడుదల చేయాలని సంఘం నాయకులు కోరారు. సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తే ప్రభుత్వ సేవలకు యథావిధిగా సహకరిస్తామని, లేకపోతే ఈ నెల 15 నుంచి అద్దె వాహనాల సేవలను నిలిపివేయడం తప్ప మరో మార్గం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అద్దె వాహన యజమానుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ రహమాన్‌తో పాటు రఘు గౌడ్, రాకేష్, అబ్దుల్ ఖాదర్, ఆంజనేయులు, తిరుపతి తదితర నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగితేనే విజయాలు సొంతం: డా. సుభాషిణి

మహబూబ్‌నగర్ అర్బన్ జులై 13 (విజన్ ఆంధ్ర) : విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటి సాధన కోసం ప్రణాళికాబద్ధంగా నిరంతరం కృషి చేయాలని డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సుభాషిణి పిలుపునిచ్చారు. పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తాటికొండలో ప్రధానోపాధ్యాయులు డా. బాలు యాదవ్ బైకాని అధ్యక్షతన నిర్వహించిన "నిపుణుల ప్రసంగం" కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యతో పాటు మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని, దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. క్రమశిక్షణ, విలువలు, సమయపాలన వంటి సద్గుణాలు జీవితంలో విజయానికి బలమైన పునాదిగా నిలుస్తాయని తెలిపారు.

పదో తరగతి అనంతరం అందుబాటులో ఉన్న వివిధ విద్యా



అవకాశాలు, కోర్సులు, పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. తమ ఆసక్తులు, సామర్థ్యాలకు అనుగుణంగా సరైన కోర్సులను ఎంపిక చేసుకుని ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, డిగ్రీ కళాశాల విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విద్యను సమర్థవంతంగా నిర్వహించాలి

**- చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే ప్రీ ప్రైమరీ పాఠశాలల లక్ష్యం,**

**- ఉపాధ్యాయుల అంకితభావంతో ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసం పెంపొందించాలి**

**- వర్షాలకు దెబ్బతిన్న నార్లాపూర్ ప్రాథమిక పాఠశాల తరగతి గదులను పరిశీలించిన జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్**

కొల్లాపూర్ జూలై 13 : (విజన్ ఆంధ్ర) కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండలం కల్వకోలు గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రమేష్ కుమార్ 30 మంది విద్యార్థులతో ప్రీ ప్రైమరీ తరగతులను ఘనంగా ప్రారంభించారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించేలా ఏర్పాటు చేసిన తరగతి గదులను పరిశీలించి చిన్నారులకు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. విద్యార్థుల హాజరు, విద్యా బోధన ఏర్పాట్లు, తరగతి గదుల నిర్వహణ, బోధనా సామగ్రి వినియోగం తదితర అంశాలను పరిశీలించి, డిఇఓ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈఓ రమేష్ కుమార్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. చిన్నారుల్లో బాల్య దశ నుంచే అభ్యాస నైపుణ్యాలు, భాషా సామర్థ్యం, సృజనాత్మకత, ఆలోచనా విధానం, సామాజిక విలువలు పెంపొందించేందుకు ప్రీ ప్రైమరీ విద్య ఎంతో కీలకమని తెలిపారు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమంలో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దే



దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు చిన్నారుల మానసిక స్థాయిని అర్థం చేసుకొని ఆటలు, పాటలు, కథలు, చిత్రాలు, కార్యాచరణ ఆధారిత బోధన ద్వారా అభ్యాసాన్ని ఆసక్తికరంగా మార్చాలని డిఇఓ సూచించారు. చిన్నారులలో పాఠశాలపై ఆసక్తి పెంపొందించడం ద్వారా వారి భవిష్యత్ విద్యాభ్యాసానికి ప్రీ ప్రైమరీ పాఠశాలలు బలమైన పునాది వేయవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రతి విద్యార్థిని సొంత బిడ్డలుగా భావించి బోధించాలని కోరారు. విద్యా ప్రమాణాలను పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రత, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు, సమర్థవంతమైన బోధన అందుతున్నాయనే నమ్మకం తల్లిదండ్రుల్లో కలిగేలా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని అన్నారు. ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికితీసి ఉన్నత లక్ష్యాల వైపు నడిపించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు.

అనంతరం డీఈఓ కొల్లాపూర్ మండలంలోని నార్లాపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న తరగతి గదులను క్షుణ్ణంగా పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థుల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దెబ్బతిన్న భవనాల మరమ్మతులు లేదా పునర్నిర్మాణానికి అవసరమైన సాంకేతిక నివేదికలు, అంచనాలు, ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి సంబంధిత శాఖలకు పంపించాలని మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. భవనాల మరమ్మతులు పూర్తయ్యే వరకు విద్యార్థుల విద్యకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ తరగతి గదులను ఏర్పాటు చేసి బోధన కొనసాగించాలని డిఇఓ రమేష్ కుమార్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించడం, మౌలిక వసతుల అభివృద్ధి, నాణ్యమైన బోధన అందించడం వంటి అంశాలపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోందని డీఈఓ రమేష్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలను విజయవంతం చేయడంలో ప్రతి ఉపాధ్యాయుడు, విద్యాశాఖ అధికారి సమిష్టిగా పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి వెంకటయ్య , పెద్దకొత్తపల్లి మండల విద్యాధికారి ఉమాదేవి, కొల్లాపూర్ ఎంఈఓ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# 34వ వార్డులో చిన్నారులకు నులి పురుగుల నివారణ గోళీలు

బెల్లంపల్లి, జూలై 13 విజన్ ఆంధ్ర : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని 34వ వార్డు అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారులకు నులి పురుగుల నివారణ గోళీలు కౌన్సిలర్ కొక్కుల రామ్మూర్తి పంపిణీ చేశారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నులి పురుగుల నివారణ గోళీలను ప్రతి చిన్నారికి తప్పనిసరిగా వేయించాలని సూచించారు. నులి పురుగుల వల్ల కడుపునొప్పి, ఆకలి మందగించడం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ఈ గోళీలు చిన్నారుల ఆరోగ్య రక్షణకు ఎంతో ఉపయోగపడతాయని కౌన్సిలర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడి సిబ్బంది, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

### కాయిదంపల్లి ఎస్సీ కాలనీలో మూడు నెలల నుంచి

# తాగునీరు కటకట

## - ఇబ్బందులు ఎదుర్కొన్న ఎస్సీ కాలనీ వాసులు



ఆందోల్ జూలై13 (విజన్ ఆంధ్ర ప్రతినిధి)మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని కాయిదంపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో గత మూడు నెలల నుంచి తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు సోమవారం ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారు. గత మూడు నెలల నుంచి మిషన్ భగీరథ పథకం ద్వారా అందించే త్రాగునీటి సరఫరా అరకొరగా అందుతుందని, దీంతో పలు కార్యక్రమాలు ఎలా నిర్వహించుకోవాలని, తాగునీటి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని గ్రామస్తులు నిలదీయగా సర్పంచ్‌కు చెప్పాలంటూ ఆయన తెలియజేస్తే, సర్పంచ్ పైనుండే ప్రవాహం తక్కువగా వస్తుందంటూ బదులిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఆగ్రహించిన కాలనీవాసులు సోమవారం ప్రజావాణికి ఖాళీ బిందెలతో వచ్చి సంబంధిత అధికారులకు అర్జీ పెట్టుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ కాలనీకి క్రమం తప్పకుండా త్రాగునీరు సరఫరా చేసే విధంగా చూడాలని కోరారు.

## తప్పుల తడకగా శిలాఫలకం.. స్పీకర్, మంత్రి

## పేర్లలో పొరపాట్లు! అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

మర్పల్లి జూలై 13 (విజన్ ఆంధ్ర): మండల కేంద్రంలోని 25 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన పల్లె దవాఖాన ఆరోగ్య ఉపకేంద్రాన్ని సోమవారం తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. అయితే ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంలోనే స్పీకర్, రాష్ట్ర మంత్రి పేర్లను తప్పుగా ముద్రించడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. శిలాఫలకంపై "గడ్డం ప్రసాద్ కుమార్" అని ఉండాల్సిన చోట లిలి"గడ్డం ప్రాసాద్ కుమార్"లిలిగా ముద్రించారు. అలాగే రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ జలసరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్), మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి డి. అనసూయ సీతక్క పేరును లిలి"శ్రీమతి డి. అనసూయ సిత్కా"లిలిగా తప్పుగా నమోదు చేశారు.

శాశ్వతంగా నిలిచే శిలాఫలకంపైనే ప్రజాప్రతినిధుల పేర్లు తప్పుగా ముద్రించడంతో సంబంధిత శాఖల అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో స్పష్టమవుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రారంభోత్సవానికి ముందు శిలాఫలకాన్ని అధికారులు పరిశీలించి ఉంటే ఈ తప్పిదాలు జరిగేవి కావని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై స్పీకర్ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

# సంకెపల్లిలో ఆధార్ నమోదు శిబిరం ప్రారంభం ఈ నెల 16 వరకు సేవలు

## - సద్వినియోగం చేసుకోవాలన్న సర్పంచ్ రెడ్డవేణి పరశురామ్



వేములవాడ అర్బన్ జూలై 13 (విజన్ ఆంధ్ర ): వేములవాడ అర్బన్ మండలంలోని సంకెపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధార్ నమోదు, సవరణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రెడ్డవేణి పరశురామ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల సౌకర్యార్థం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం (జూలై 13) నుండి ఈ నెల 16వ తేదీ వరకు ఈ శిబిరం అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆధార్ కార్డులలో తప్పుల సవరణలు, కొత్తగా ఆధార్ నమోదు చేసుకునే వారు అవసరమైన ఒరిజినల్ పత్రాలతో హాజరుకావాలన్నారు. ముఖ్యంగా ఆధార్‌లో చిరునామా (అడ్రస్) మార్పు చేయించుకోవాలనుకునే వారు తప్పనిసరిగా రెసిడెన్సీ సర్టిఫికేట్‌ను (నివాస ధ్రువీకరణ పత్రం) చిరునామా రుజువుగా వెంట తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్, వార్డు సభ్యులు నాంపల్లి నాగరాజు, జెట్టి రాధా, ఎండి అజీజ్, చింతపల్లి మోహన్ రావు, రెడ్డవేణి రాజు, నాగుల మమత, రేషన్ డీలర్ కచాము శ్రీనివాస్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం: కొలన్ హన్మంత్ రెడ్డి



- -మహాదేవపురం ఎస్ ఐ ఆర్ హెల్ప్ డెస్క్‌ను పరిశీలించిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి
- -బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి పారదర్శకంగా ఓటరు నమోదు చేపట్టాలని సూచన
- -18 ఏళ్లు పూర్తిచేసుకున్న యువత కొత్త ఓటరుగా నమోదు కావాలని పిలుపు
- -ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా నింపి సమర్పించాలని ప్రజలకు విజ్ఞప్తి
- -ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని వ్యాఖ్య

కుత్బుల్లాపూర్, జులై 13 (విజన్ ఆంధ్ర); కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 277వ డివిజన్ మహాదేవపురం పరిధిలోని దేవేందర్ నగర్‌లో గాజులరామారం సర్కిల్ ఏ ఈ ఆర్ ఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) హెల్ప్ డెస్క్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియను బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి పారదర్శకంగా, నిష్పాక్షికంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలు చోటుచేసుకోకుండా ఖచ్చితమైన వివరాలతో నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను కోరారు. ప్రజలు కూడా బీఎల్‌ఓలు అందజేసే ఎన్యుమరేషన్ ఫారమ్‌లను పూర్తిస్థాయిలో నింపి సకాలంలో సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని కొత్త ఓటరుగా నమోదు కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగబద్ధ హక్కు అని పేర్కొన్న హన్మంత్ రెడ్డి, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేసి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సిద్ధునోళ్ల సంజీవ్ రెడ్డి, డీసీసీ కార్యదర్శి గణేష్, ఐఎన్‌టీయూసీ నాయకుడు దేగుల సతీష్ బాబు, లలిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలి- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



పరిగి, జూలై 13(విజన్ ఆంధ్ర ) : వికారాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా ఐపిఎస్ సోమవారం పరిగి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, సీసీటీఎన్ఎస్ నమోదు, స్టేషన్ పరిశుభ్రత, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించి అధికారులతో చర్చించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే స్వీకరించి, చట్టబద్ధంగా విచారణ పూర్తి చేసి బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరికి స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని తెలిపారు. అదేవిధంగా మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రగ్స్, గంజాయి, పేకాట, అక్రమ మద్యం, సైబర్ నేరాలు మరియు ఇతర సంఘవిద్రోహ కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగిస్తూ సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రి వేళల్లో వాహన తనిఖీలు, బీట్ పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని, గ్రామ పోలీస్ అధికారులు (వీపీవోలు), వికారాబాద్ సురక్ష మిత్ర వాలంటీర్లతో సమన్వయం పెంచి ప్రజల్లో భద్రతపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం "వికారాబాద్ రక్షణ నేత్రం" కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరును, వాటి ద్వారా జరుగుతున్న పర్యవేక్షణను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి, గ్రామాలు, ప్రధాన రహదారులు, కూడళ్లు మరియు ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలను సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. అలాగే సీసీటీఎన్ఎస్ ఈ–సాక్ష్య వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను పూర్తి స్థాయిలో వినియోగిస్తూ, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, పారదర్శకత, ప్రజాసేవా దృక్పథంతో పనిచేస్తూ జిల్లా పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ మోహన్ కృష్ణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వలిగొండలో దుర్గాభవాని హీరో బైక్ షోరూంను ప్రారంభించిన సర్పంచ్

యాదాద్రి జులై 13 వలిగొండ (విజన్ ఆంధ్ర) వలిగొండ పట్టణ కేంద్రంలో ప్రోపరేటర్ వలందాసు సతీష్ గౌడ్ స్వాతిల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన దుర్గ భవాని హీరో బైక్ మోటార్స్ సేల్స్ అండ్ సర్వీస్ వాహనాల షోరూంను వలిగొండ సర్పంచ్ కుంభం వెంకటపాపిరెడ్డి సోమవారం ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఉ మ్మడి నల్గొండ జిల్లా హీరో షోరూం డిస్ట్రిబ్యూటర్ గట్టు రాంమోహన్,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు పాసం సత్తిరెడ్డి పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు శాఖ గ్రంథాలయ అధ్యక్షులు వల్లందాసు సోమేశ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్,బత్తిని లింగయ్య,మల్ల వెంకటేశం, అయిటిపాముల రవీంద్ర కొండూరు భాస్కర్ కొండూరు వెంకటేశం దుర్గభవాని హీరో షోరూం మేనేజర్ సైదులు సిబ్బంది రమేష్ శ్రీ రామ్ ఫైనాన్స్ తదితర ఫైనాన్స్ సౌకర్యం కల్పించే యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## వాగులో చెక్ డాం పరిశీలించిన సర్పంచ్ నర్సింగ రామకృష్ణ



లింగాల గణపురం జూన్ 13(విజన్ ఆంధ్ర) జనగామ జిల్లా లింగాల గణపురం మండలంలోని నెల్లుట్ల గ్రామ రెవెన్యూ పరిధిలో వాగులో చెక్ డాం పరిశీలించిన సర్పంచ్ నర్సింగ రామకృష్ణ చెక్ డాంకు గుంతలు ఏర్పడ్డాయి వాటిని పరిశీలించడం జరిగింది,ఈ కార్యక్రమంలో పటేల్ గూడెం సర్పంచ్ పెంటల బుచ్చయ్య, చెక్ డాం కింది రైతులు ముస్కు సత్తిరెడ్డి అరె సంజీవ్ రెడ్డి , మంద స్వామి పెంటల మల్లారెడ్డి, పెండ్లి సతీష్,మంద శ్రీనివాస్, రామచేంద్ర, కుమార్, ముస్కు రాజు,తదితరులు పాల్గొన్నారు

## జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

లింగాల గణపురం జూన్ 13 (విజన్ ఆంధ్ర) జనగామ జిల్లా లింగాల గణపురం మండలంలోని
జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆరోగ్యవంతమైన పిల్లలకు అల్బెండజోల్ టాబ్లెట్ సర్పంచ్ నర్సింగ రామకృష్ణ ప్రారంభించారు,
1సం॥ నుండి 19 సం॥ల వయస్సు ఉన్న పిల్లలందరికి ఆల్బెండజోల్ టాబ్లెట్ ను కళాశాలలు, పాఠశాలలు మరియు అంగన్ వాడీ కేంద్రాల వద్ద ఉచితంగా ఇవ్వబడుతుంది.
ఈ కార్యక్రమం పీణూా శివశేఖర్ రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ గుర్రం బాలరాజు గౌడ్, ఎఱజ చెర్మన్ బత్తిని అశోక్, వీజూా,స్కూల్ హెడ్ మాస్టర్ సమ్మక్క,టీచర్స్,నాచీవీ అంజమ్మ, ఆశ కార్యకర్తలు తదితరులు



### ఉదండాపూర్ డ్యామ్ వద్ద సగం నంబర్ ప్లేట్లతో

# ఇసుక దందా



- ➔ రిజిస్ట్రేషన్ ఉన్నా నంబర్లు లేవు
- ➔ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ➔ సగం నంబర్ల దందా
- ➔ రిజిస్ట్రేషన్ ఉన్నా నంబర్లు లేవు
- ➔ అతివేగంతో ప్రమాదాల ముప్పు
- ➔ అనర్హులతో డ్రైవింగ్
- ➔ వరద మట్టిని ఇసుకగా అమ్మకం
- ➔ నిద్రమత్తులో అధికారులు

జడ్చర్ల, జులై 13,(విజన్ ఆంధ్ర): ఉదండాపూర్ రిజర్వాయర్ డ్యామ్ పరిసరాల్లో అక్రమ ఇసుక రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. మైనింగ్,రెవిన్యూ,పోలీసులు, అధికారుల కళ్ళు గప్పి వాహనాలకు సగం నంబర్ ప్లేట్లతోనే రాత్రింబవళ్లు ఇసుక తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనానికి ఉండాల్సిన 4 నంబర్ లలో 2 మాత్రమే ఉంటున్నాయి. మిగతా 2 నంబర్లు ఉండట్లేదు. యా 08 ఖఇ 48 నంబర్ గల భారత్ బెంజ్ టిప్పర్ అనుమానాస్పదంగా కనిపించింది. కొన్ని ఇసుక టిప్పర్లకు రిజిస్ట్రేషన్ ఉన్నప్పటికీ నంబర్ ప్లేట్లే ఉండట్లేదు. అలాంటి వాహనాలు రాత్రనక పగలనక ఇష్టం వచ్చిన స్పీడుతో రోడ్లపై దూసుకుపోతున్నాయి. ప్రమాదం జరిగినా నంబర్లు లేకపోవడంతో వాహనాన్ని గుర్తించడం కష్టంగా మారుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నవాబ్ పేట మండలం మల్లారెడ్డి పల్లి గ్రామానికి చెందిన కల్మకళ యాదయ్యకు సంబంధించిన వాహనాలు ఈ దందాలో ఉన్నాయని ఆరోపణలు ఉన్నాయి. పగటిపూట అన్ని నంబర్లు పెట్టి, రాత్రికి వచ్చేసరికి 2 నంబర్లు పీకేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. లైసెన్స్ లేని మైనర్ డ్రైవర్లు, లతో భారీ వాహనాలు నడిపిస్తున్నారని, వర్షానికి కొట్టుకువచ్చిన మట్టిని ఫిల్టర్ చేసి ఇసుకగా అమ్ముతున్నారని ఆరోపిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి భారీగా రెవెన్యూ నష్టం వాటిల్లుతోంది. ఉదండాపూర్ డ్యామ్ కట్టపై భారీ వాహనాల రాకపోకలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు.

నిద్రమత్తులో ఉన్న పోలీస్, ఆర్టీవో అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ ఉన్నా నంబర్లు లేని వాహనాలపై, సగం నంబర్లతో తిరిగే టిప్పర్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆర్టీవో, పోలీసు, రెవిన్యూ,మైనింగ్ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, అక్రమాలకు పాల్పడుతున్న వాహనాలను సీజ్ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పారిశ్రామిక కార్మికులకు కనీస వేతనాలు వెంటనే అమలు చేయాలి



**చట్టబద్ధమైన అన్ని హక్కులు కల్పించాలని సిఐటియు డిమాండ్**
**-జీవో నెం. 6ను జిల్లా వ్యాప్తంగా కచ్చితంగా అమలు చేయాలని విజ్ఞప్తి**
**-ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, భద్రతా సౌకర్యాలు ప్రతి కార్మికుడికి అందించాలని డిమాండ్**
**-కార్మిక సంఘాల నాయకులపై వేధింపులు, బెదిరింపులు నిలిపివేయాలని ప్రభుత్వానికి సూచన**
**-కార్మిక చట్టాలు ఉల్లంఘించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పిలుపు**
**-ప్రగతి నగర్ సుందరయ్య భవన్‌లో సిఐటియు జిల్లా కమిటీ మీడియా సమావేశం**
**-కార్మికుల రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరిన నాయకులు**

కుత్బుల్లాపూర్, జులై 13 (విజన్ ఆంధ్ర ): పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలను తక్షణమే అమలు చేయడంతో పాటు, చట్టబద్ధంగా లభించాల్సిన అన్ని సంక్షేమ సౌకర్యాలను కల్పించాలని సిఐటియు మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రగతి నగర్‌లోని సుందరయ్య భవన్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. అశోక్ మాట్లాడుతూ, జిల్లా పరిధిలోని అన్ని పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, వేతనంతో కూడిన సెలవులు, భద్రతా పరికరాలు వంటి చట్టబద్ధమైన సౌకర్యాలను ప్రతి యాజమాన్యం తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సామాజిక భద్రతా పథకాల పరిధిలో ఇంకా చేరని కార్మికులను వెంటనే నమోదు చేసి వారికి అన్ని ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కనీస వేతనాలు, కార్మిక హక్కుల కోసం ప్రశ్నించిన కార్మికులు, కార్మిక సంఘాల నాయకులను యాజమాన్యాలు బెదిరించడం, వేధించడం, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించడం వంటి చర్యలను ప్రభుత్వం కఠినంగా అరికట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 6ను జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పారిశ్రామిక సంస్థల్లో ఎలాంటి మినహాయింపులు లేకుండా అమలు చేయాలని, కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కార్మిక శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్మికులకు రాజ్యాంగం కల్పించిన సంఘటిత హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో సిఐటియు సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ వెంకట రామయ్య, సిఐటియు మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వెంకట్రాజ్యం, జిల్లా సహాయ కార్యదర్శి లింగస్వామి, జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్, మండల నాయకులు నాగభూషణ్, స్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ను గడువు లోపల పూర్తి చేయాలి... ఆర్డిఓ విజయకుమారి..

బోధన్, జులై 13(విజన్ ఆంధ్ర) : ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని బోధన్ ఆర్డిఓ విజయకుమారి బిఎల్ఓ లకు సూచించారు. సోమవారం బోధన్ నియోజకవర్గం నవీపేట మండలంలోని 190-201 పోలింగ్ బూత్ లను, నవీపేట మండల కేంద్రం, నవీపేట తండా, అభంగపట్నం, రెంజల్ మండలంలోని కూనేపల్లి 149బూత్ ను, సాటాపూర్ గ్రామంలోని 139వ బూత్ ను ఆకస్మికంగా సందర్శించారు. బిఎల్ఓ లు చేపడుతున్న సర్ ప్రక్రియను పరిశీలించారు. సర్-2026 లో జరుగుతున్న ఎన్యుమరేషన్ ఫార్మ్ ల డిజిటైజేషన్ ప్రక్రియను సమీక్షించారు. త్వరిత గతిన ప్రక్రియను కొనసాగిస్తూ, ఇచ్చిన గడువు లోపల డిజిటైజేషన్ ను పూర్తి చేయాలని బిఎల్ఓ లకు సూచించారు.

## తాటిచర్ల 2 కేటాయింపు చరిత్రలో కీలకం

### ఘనంగా విజయోత్సవ సంబరాలు

మందమర్రి, జూలై 13 (విజన్ ఆంధ్ర) : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంస్థకు ప్రభుత్వం తాడిచర్ల 2 బొగ్గు బ్లాక్ ను కేటాయించడం చరిత్రలో కీలకమని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం జిఎం కార్యాలయంలో విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులకు,కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటుజిఎం లలిత్ ప్రసాద్,ఏఐటీయూసీ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ,సీఎంఓఏఐ ప్రతినిధి సరిత,డీజీఎం పర్సనల్ అశోక్,సీనియర్ పిఓ సత్యనారాయణ,అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

## జాలిగామలో విజయవంతంగా కొనసాగుతున్న 'సార్' ప్రక్రియ

### - సర్పంచ్ తాళ్ళ సునీత ఆంజనేయులు గౌడ్

గజ్వేల్ నియోజకవర్గం, 13 జూలై 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో భారత ఎన్నికల సంఘం ఆదేశానుసారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'సార్' ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోందని గ్రామ సర్పంచ్ తాళ్ళ సునీత ఆంజనేయులు గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియలో పాల్గొని, దీనిని త్వరగా పూర్తి చేయడానికి సహకరించాలి. ప్రజలకు పంపిణీ చేసిన 'సార్' ఫారాలను పూర్తిగా, సరైన వివరాలతో నింపాలన్నారు. నింపిన ఫారాలను సకాలంలో సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్లకు అందజేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జరుగుతున్న ఈ సర్వే విజయవంతానికి గ్రామస్తులందరూ బాధ్యతగా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ లు, ఉప సర్పంచ్ కొమురయ్య, సెక్రటరీ అజారుద్దీన్, వార్డు సభ్యులు చిట్యాల ఎల్లం, కరుణాకర్, మనోహర్, రసముల కరుణాకర్, నాని, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




# ఓటును భద్రపరుచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

### - సిద్దిపేట డిసిసి అధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి



గజ్వేల్, 13 జూలై 2026 (విజన్ ఆంధ్ర) : ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని, ఆ ఓటును భద్రపరుచుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని సిద్దిపేట డిసిసి అధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు హెల్ప్ డెస్కు ను ఆమె సోమవారం రోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆంక్షా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటు సవరణ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఓటు నమోదు, సవరణల ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియలో స్వచ్ఛందంగా సేవలందిస్తున్న బీఎల్ఓ బసడి మమత, సామాజిక కార్యకర్త సాదిక్ పాషా, కాంగ్రెస్ నాయకులు కృపానందం, కనక స్వామిల సేవలను ఆమె ప్రత్యేకంగా కొనియాడారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, నాయిని యాదగిరి, వహీద్ ఖాన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు నక్క సంతోష్ రాములు, గుంటుకు లక్ష్మి శ్రీనివాస్, జోగిని లక్ష్మణ్, మహంకాళి చంద్రం, కృపానందం, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# నూతన పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించిన 'దేవసాని బలగం-కుటుంబ పరివార్'

- చేనేత రంగానికి ప్రత్యేక నిధులు కేటాయించి, పద్మశాలీలను ఆదుకోవాలి: ప్రభుత్వానికి విజ్ఞప్తి
- చేనేత కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం: చేనేత సహకార సంఘం అధ్యక్షులు స్వర్గం రాజేశం



గజ్వేల్, 13 జూలై 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చేనేత పారిశ్రామిక సహకార సంఘం నూతన పాలకవర్గ సభ్యులకు 'దేవసాని బలగం-కుటుంబ పరివార్' (అక్కారం-గజ్వేల్) కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సంఘ నూతన పాలకవర్గ సభ్యులను శాలువాలు మరియు మెమెంటోలతో ఘనంగా సత్కరించి, మిఠాయిలు పంచి తమ సంతోషాన్ని పంచుకున్నారు. స్వర్గం రాజేశం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చేనేత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు స్వర్గం రాజేశం మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా చేనేత సహకార సంఘానికి ఎన్నికలు జరగకపోవడం వల్ల సంఘం ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదని, దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా నూలు వస్త్రాల తయారీ కూడా కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో సమిష్టి నిర్ణయాలతో కార్మిక సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ద్వారా అందే నేతన్న భరోసా, నేతన్న మిత్ర, నేతన్న పింఛన్లు, నేతన్న పొదుపు పథకాలు, రూపాయలు 5 లక్షల ప్రమాద బీమాతో పాటు ముడిసరుకులు, నూలు, రసాయనాల సబ్సిడీలను అర్హులైన కార్మికులందరికీ అందేలా చూస్తామన్నారు.

కార్పొరేట్ కంపెనీల రాక వల్ల నిరుపేద చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి పద్మశాలీలను అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో సంఘంలో సభ్యత్వాలను భారీగా పెంచి, చేనేత రంగాన్ని పూర్వవైభవానికి తీసుకురావడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవసాని మాట్లాడుతూ అక్కారం-గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో 'దేవసాని బలగం-కుటుంబ పరివార్'కు చెందిన 27 కుటుంబాలు ఉన్నాయని, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి సేవా సంఘంలో 126 ఓటు హక్కు కలిగిన సభ్యులు ఉన్నారని తెలిపారు. చేనేత సంఘంలో కూడా దేవసాని కుటుంబ సభ్యులకు 'ఇంటికి ఒకరు' చొప్పున సభ్యత్వం కల్పించాలని ఈ సందర్భంగా పాలకవర్గానికి విజ్ఞప్తి చేశారు. గతంలో జరిగిన పద్మశాలి సేవా సంఘం ఎన్నికలలో దేవసాని హనుమాన్ దాస్ ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకున్న విషయాన్ని గుర్తు చేస్తూ రాబోయే పద్మశాలి సంఘం ఎన్నికల్లోనూ దేవసాని బలగం సభ్యులంతా చురుకుగా పాల్గొని, సమిష్టి కృషితో విజయానికి తోడ్పడతామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ చేనేత పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షులు పూల సత్యం, ప్రధాన కార్యదర్శి ఎనగందుల రామచంద్రం, డైరెక్టర్లు దొంతుల ప్రసాదు భాగ్యలక్ష్మి, పద్మశాలి కుల పెద్దలు ఆడెపు బాలచంద్రం, సిలువేరు బలరాం, పద్మశాలి యువజన సంఘం ప్రధాన కార్యదర్శి నాగరాజు నేత, దేవసాని బలగం కుల పెద్దలు దేవసాని నాగభూషణం, దేవసాని వాసుదేవ్, పోశెట్టి, దేవసాని భాస్కర్, దయానంద సత్యానందు, పద్మశాలి సంఘం కోశాధికారి దేవసాని హనుమాన్ దాస్, సుధాకర్, శ్రీనివాస్, రాజారాం, ఓం ప్రకాష్, వేణు, రవి, రాజేందర్, బాలరాజు, ప్రసాద్ నవీన్, పద్మశాలి కుల పెద్దలు, దేవసాని కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# మరకత లింగేశ్వరుని సన్నిధిలో వీఐపీల తాకిడి

**స్వామి వారిని దర్శించుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, కాట శ్రీనివాస్ గౌడ్, సినీ నటుడు సురేష్, చిన్న, మెదక్ ఎంపీ సతీమణి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తల్లి, మున్సిపల్ చైర్మన్ దర్శించుకున్న 30 వేల మంది భక్తులు**

శంకర్‌పల్లి; జూలై 13: (విజన్ ఆంధ్ర): శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో గల మరకత శివాలయంలో మాస శివరాత్రి సందర్భంగా సోమవారం చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. ఆలయ చైర్మన్ కడకంచి కుమార్ యాదవ్.. ఎమ్మెల్యే, పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్, సినీ నటుడు సురేష్, చిన్న, ఎసిపి కిషన్ గౌడ్ సతీమణి, మెదక్ ఎంపీ సతీమణి మంజుల దేవి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తల్లి, మున్సిపల్ చైర్మన్ ప్రవీణ్ కుమార్ దంపతులను స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేసి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం మహా శైవాఖ్య యోగంను పురస్కరించుకుని ఆధ్యాత్మికంగా అత్యంత విశిష్టమైన రోజు, కృష్ణ చతుర్దశి, ఆరుద్ర నక్షత్రం, ఒకేసారి రావడం వల్ల ఏర్పడిన ఈ అరుదైన యోగం 225 ఏళ్లలో తొమ్మిదిసార్లు మాత్రమే వస్తుంది. వంద శివరాత్రుల పుణ్యఫలాన్ని ఇచ్చే ఈ రోజు శివుని ఆరాధనకు పరమ పవిత్రమైనదని పురోహితులు చెబుతున్నారని గుర్తు చేశారు. శివాలయంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం చేయడం వల్ల సకల పాపాలు తొలగిపోయి ఇళ్లలో సుఖ సంతోషాలు చేకూరుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచి మల్లికార్జున, కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, అర్చకులు సాయిశివ, ప్రమోద్ పాల్గొన్నారు.